# పెన్ పవర్

PEN POWER 12 YEARS JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 7 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శనివారం 12 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :7 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM SAT 12 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


# శాంతిభద్రతలే లక్ష్యం

## 'త్రిశూల్' ఆపరేషన్‌కు సీఎం చంద్రబాబు ఆదేశం

- 'త్రిశూల్' పేరుతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ఆదేశం
- డ్రగ్స్, మహిళలపై వేధింపులు, రోడ్డు ప్రమాదాల నిర్మూలనే లక్ష్యం
- సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై కఠిన చర్యలకు దిశానిర్దేశం
- రాష్ట్రంలో నేరాల రేటు 14 శాతం తగ్గిందన్న ముఖ్యమంత్రి
- రోడ్డు ప్రమాదాల్లో ఏపీ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని ఆవేదన




**పెన్ పవర్ డెస్క్:**రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ఆదేశాలు జారీ చేశారు. 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో భాగంగా ఎస్పీలు, కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో 'త్రిశూల్' పేరుతో ప్రత్యేక కార్యాచరణకు ఆయన శ్రీకారం చుట్టారు. 'జీరో డ్రగ్స్, మహిళలపై వేధింపుల పట్ల జీరో టాలరెన్స్, జీరో రోడ్డు ప్రమాదాలు' లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'త్రిశూల్' పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు, వ్యవస్థీకృతంగా సాగుతున్న వేధింపులపై ఉక్కుపాదం మోపాలని స్పష్టం చేశారు. ఈ అంశాలపై మంత్రుల కమిటీ లోతైన అధ్యయనం చేస్తుందని ఆయన తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి జిల్లాకు సాంకేతిక పరిజ్ఞానం కలిగిన 30 మంది కానిస్టేబుళ్లను కేటాయించినట్లు వెల్లడించారు. గంజాయి సహా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక క్యాలెండర్ రూపొందించి

- మిగతా 2లో

### కలెక్టర్లకు సీఎం చంద్రబాబు డెడ్‌లైన్లు.. ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలు



- మార్చి 2027 నాటికి దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారం
- 2027 మార్చి నాటికి 5.32 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి
- 2028 డిసెంబర్‌కల్లా ప్రతి గ్రామీణ ఇంటికి కుళాయి కనెక్షన్
- 2027 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధన.. 50 లక్షల మంది యువతకు ఏఐలో శిక్షణ



## పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్

- డీఎస్సీతో 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామన్న కేశినేని చిన్ని
- డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి జగన్ అని విమర్శ
- ఐదేళ్ల పాలనలో జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

- మిగతా 2లో



## అల్పపీడన ప్రభావంతో ఏపీలో వర్షాలు..

### అప్రమత్తమైన ప్రభుత్వం

**పెన్ పవర్ డెస్క్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా–ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతం కావడంతో ఏపీ ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున

- మిగతా 2లో

## ఏపీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలు విడుదల

- సెప్టెంబరు జీతంతో పెంచిన డీఏ
- 2025 జనవరి నుంచి 1.82 శాతం డీఏ అమలు
- 2024 జులై నుంచి 2.73 శాతం డీఏ
- 2028లో 1.82 శాతం డీఏ బకాయిలు
- పింఛనుదారులకూ ఇదే షెడ్యూల్‌లో బకాయిలు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రెండు డీఏలను విడుదల చేస్తూ ఆర్థిక శాఖ

- మిగతా 2లో

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

- మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత
- బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి
- అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ

- మిగతా 2లో






## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

### హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని నగర పోలీసుల సూచన

- మిగతా 2లో



## ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్..

### 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ వాటా 40 శాతానికి పైగా ఉందన్న పుతిన్
- జీ7 వాటా 29 శాతమేనని వెల్లడి
- ఐదేళ్ల ప్రపంచ వృద్ధిలో బ్రిక్స్ వాటా సగానికి పైగానే ఉందని వెల్లడి
- జీ7 వృద్ధి వాటా 18 శాతంగా ఉందని ప్రస్తావన
- బ్రిక్స్ కోసం కొత్త పెట్టుబడి వేదిక ఏర్పాటుకు పుతిన్ ప్రతిపాదన

- మిగతా 2లో


# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం

- ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత ముఖ్యం
- సముద్ర వాణిజ్యానికి పెరుగుతున్న అంతరాయాలపై ప్రధాని మోదీ ఆందోళన
- ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పెరిగిందన్న ప్రధాని
- బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు, భాగస్వామ్యం పెరగాలని పిలుపు



**పెన్ పవర్ డెస్క్:**ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్రయాన స్వేచ్ఛ, నావికుల భద్రత అత్యంత కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో సముద్ర వాణిజ్యానికి, సరఫరా వ్యవస్థలకు (సప్లై చైన్స్) ఎదురవుతున్న అంతరాయాల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సురక్షితమైన, పటిష్ఠమైన సరఫరా గొలుసులకు, నౌకాయాన స్వేచ్ఛకు భారత్ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్'లో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం దినదినాభివృద్ధి చెందుతోందని మోదీ పేర్కొన్నారు.

- మిగతా 2లో



## మార్చి నాటికి బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు: గడ్కరీ

**పెన్ పవర్ డెస్క్:** ఫాస్టాగ్ కారణంగా టోల్‌ప్లాజాల వద్ద వేచి చూసే సమయం గణనీయంగా తగ్గిందని, వచ్చే ఏడాది నుంచి అసలు ఆగే అవసరమే ఉండదంటున్నారు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2027 మార్చి కల్లా బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు

- మిగతా 2లో

## మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

- మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్
- తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు
- 55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం



**పెన్ పవర్ డెస్క్:**తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి

- మిగతా 2లో

## తెలంగాణలో అనలాగ్ పనీర్‌పై నిషేధం

- ప్రజారోగ్యం దృష్ట్యా సర్కార్ కీలక నిర్ణయం
- తయారీ, అమ్మకాలపై ఏడాది పాటు నిషేధం విధింపు
- సెప్టెంబర్ 10 నుంచి అమల్లోకి వచ్చిన ఉత్తర్వులు

**పెన్ పవర్ డెస్క్:**ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 'అనలాగ్' (కృత్రిమ) పన్నీర్‌పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిషేధం ఏడాది పాటు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్నీర్ పేరిట విక్రయిస్తున్న నాణ్యత లేని, కల్తీ ఉత్పత్తుల

- మిగతా 2లో






# మాధవ్ మాట వింటారా? అందరూ సీతయ్యలేగా?

ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ కు స్థానిక సంస్థల ఎన్నికలు సవాల్ గా మారనున్నాయి. అన్ని రకాల వత్తిడిలు ఆయన ఎదుర్కొనాల్సి ఉంటుంది. ఒకవైపు రాష్ట్రంలో కూటమిలోని మిత్ర పక్షాలతో సమన్వయం చేసుకుని వెళ్లడం, మరొకవైపు సొంత పార్టీ నేతలను సంతృప్తిపర్చడం మాధవుడికి ఛాలెంజ్ అని చెప్పాలి. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయిన తర్వాత జరిగే తొలి ఎన్నికలు కావడంతో ఆయన తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మరొకవైపు కొన్ని దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ లో బీజేపీ ఎదగలేదు. అలాగే పొత్తు లేకుండా గెలిచే సీన్ లేదు. ఆ సంగతి తెలిసినా కేంద్ర నాయకత్వం దృష్టిలో ఈ ఎన్నికల ఫలితాలు తన నాయకత్వం సామర్థ్యంపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనలో మాధవ్ ఉన్నారని అంటున్నారు. నేతలు మాధవ్ కు సహకరించే విషయంలో కూడా తక్కువేనని చెప్పాలి.

**పార్టీ బలోపేతానికి...**

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు ఎక్కువ స్థానాలపై పట్టు సాధించడమే బీజేపీ ప్రధాన వ్యూహంగా ఉంది. బీజేపీ రాష్ట్రంలో నాలుగు జోన్లుగా విభజన చేసి ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఎన్నికల నిర్వహణ, వ్యూహ రచన కోసం రాష్ట్రాన్ని ఉత్తరాంధ్ర, గోదావరి, కోస్తాంధ్ర, రాయలసీమనాలుగు జోన్లుగా విభజించి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ స్ట్రాటజీ ప్రకారం సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగించారు. విశాఖ, రాజమండ్రి, తిరుపతి, గుంటూరు వంటి ప్రధాన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు మరియు జెడ్పీ స్థానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఢిల్లీ అధిష్టానం రాష్ట్ర నేతలకు దిశానిర్దేశం చేసింది.

**సీనియర్ నేతలను...**

కూటమి ధర్మం పాటిస్తూనే, పార్టీకి పట్టున్న ప్రాంతాల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేసేలా సీట్ల సర్దుబాటుపై జనసేన, టీడీపీలపై బీజేపీ ఒత్తిడి పెంచుతోంది. శక్తి కేంద్రాలు, మ్యానిఫెస్టో ప్రచారం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా రాష్ట్రంలో పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేస్తున్నారు. మరొకవైపు పార్టీలో నేతలందరూ సీనియర్లు. వారు ఎవరి మాట వినరు. దాదాపు అందరూ సీతయ్యలే. అందుకే నాయకులను సమన్వయం చేసుకుని ప్రజల వద్దకు వెళుతూ పార్టీని బలోపేతం చేయాలంటే ఒక్క అధ్యక్షుడి వల్ల కాదు. సమిష్టిగానే పార్టీ ఎదుగుదల, విజయం సాధ్యమవుతుంది. కానీ ఓటమి మాత్రం మాధవ్ ఖాతాలో పడే అవకాశముంది. అందుకే మాధవ్ లో అలజడి మొదలయింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుకున్న స్థానాలను సాధించడంతో పాటు గెలిపించుకోవడం కూడా అతి పెద్ద సమస్య మాధవ్ ముందుంది. మరి దీనిని ఎలా అధిగమిస్తారన్నది చూడాలి.

## ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు
## హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.

**ప్రధాన మళ్లింపులు ఇవే:**

పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# కలెక్టర్లకు సీఎం చంద్రబాబు డెడ్‌లైన్లు.. ప్రతి శాఖకు స్పష్టమైన లక్ష్యాలు

రాష్ట్రంలో పాలనను గాడిన పెట్టే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికార యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో ప్రతి శాఖకు నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశిస్తూ, వాటిని పూర్తి చేయడానికి కచ్చితమైన గడువును ఖరారు చేశారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం నుంచి అభివృద్ధి పనుల వరకు ప్రతి అంశంలోనూ వేగం పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు.ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన భూ వివాదాలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. దీర్ఘకాలిక భూ సమస్యలను 2027 మార్చి నాటికి పూర్తిగా పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న సెక్షన్-22ఏ దరఖాస్తులను 2026 అక్టోబర్ నాటికి క్లియర్ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గృహ నిర్మాణం రంగంలో భాగంగా, 2027 మార్చి నాటికి 5.32 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు తక్షణమే అప్పగించాలని స్పష్టం చేశారు.

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. 2028 డిసెంబర్ నాటికి ప్రతి గ్రామీణ ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను యుద్ధప్రాతిపదికన కల్పించాలని సూచించారు. తాగునీటి సరఫరాకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, జలవనరులను పునరుద్ధరించాలని జలవనరుల శాఖకు దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్య, ఉపాధి రంగాలపై ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. 2027 నాటికి రాష్ట్రంలో నూరు శాతం అక్షరాస్యత సాధించాలని, 50 లక్షల మంది యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులలో శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. పరిశ్రమలను ప్రోత్సహించడం, 5 లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడం, ఎంఎస్ఎంఈ పార్కులలో మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఆర్థిక ప్రగతికి బాటలు వేయాలని సూచించారు. ఇంధన రంగంలో భాగంగా 9 లక్షల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ లక్ష్యాలన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన పాలన అందించాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు.ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు.పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది.

మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.
రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

# శాంతిభద్రతలే లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

విస్తృత ప్రచారం కల్పించాలని, విశాఖపట్నం, తిరుపతి, అమరావతి నగరాల్లో డీ-అడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉండటంపై ఆవేదన వ్యక్తం చేసిన సీఎం, ప్రతి ప్రమాదాన్ని క్షుణ్ణంగా ఆడిట్ చేసి, అందుకు గల కారణాలను విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు.గత రెండేళ్లలో రాష్ట్రంలో నేరాలు 14 శాతం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు 29.2 శాతం తగ్గాయని చంద్రబాబు వివరించారు. ప్రస్తుతం శిక్షల ఖరారు రేటు (కన్విక్షన్ రేటు) 47 శాతంగా ఉందని, దీనిని మరింత పెంచాలని సూచించారు. నేరం జరిగిన 30 నిమిషాల్లోపే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవాలని, కేసుల సత్వర పరిష్కారానికి 'వన్ కోర్టు-వన్ కానిస్టేబుల్' విధానాన్ని పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఢిల్లీ నుంచి అగ్రదేశాలకు పుతిన్ సవాల్.. 'బ్రిక్స్' బలమెంతో చెప్పిన రష్యా అధ్యక్షుడు!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రపంచ జీడీపీలో బ్రిక్స్ దేశాల వాటా 40 శాతానికి పైగా ఉందని చెప్పారు. జీ7 దేశాల వాటా 29 శాతమేనని తెలిపారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన 'బ్రిక్స్ బిజినెస్ ఫోరం'లో పుతిన్ మాట్లాడారు. గత ఐదేళ్ల గణాంకాలను ఆయన ప్రస్తావించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో సగానికి పైగా బ్రిక్స్ దేశాల నుంచే వచ్చిందన్నారు. అదే సమయంలో జీ7 దేశాల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు.బ్రిక్స్ ఎదుగుదలను పాశ్చాత్య దేశాలు గమనిస్తున్నాయని పుతిన్ అన్నారు. తమ పోటీ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు అవి ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఈ పోటీ కొన్ని సందర్భాల్లో అసహ్యకర స్థాయికి చేరుతోందని వ్యాఖ్యానించారు.బ్రిక్స్ దేశాల కోసం కొత్త పెట్టుబడి వేదికను ఏర్పాటు చేయాలని పుతిన్ ప్రతిపాదించారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా దీనిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు సమీకరించేందుకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.
బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయని పుతిన్ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం లోతైన మార్పులు జరుగుతున్నాయని చెప్పారు. కొత్త వృద్ధి కేంద్రాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.రష్యాపై 30 వేలకు పైగా ఆంక్షలు ఉన్నాయని పుతిన్ వెల్లడించారు. ప్రపంచం మార్పుల దశలో ఉందని చెప్పారు. ఈ మార్పులు మానవాళి భవిష్యత్తుకు అవసరమని పేర్కొన్నారు.

# పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం.. దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించు జగన్

- మొదటి పేజి తరువాయి

డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో
ఏపీపీఎస్సీ, గ్రూప్-1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

# ఏపీ ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. రెండు డీఏలు విడుదల

- మొదటి పేజి తరువాయి

ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన డీఏలను సెప్టెంబరు నెల జీతంతో కలిపి చెల్లించాలని ఆదేశించింది. 2025 జనవరి 1 నుంచి 1.82 శాతం డీఏ అమల్లోకి రానుంది. దీనికి సంబంధించిన 20 నెలల బకాయిలను 2028లో నాలుగు విడతల్లో చెల్లించనున్నారు. జనవరి, మార్చి, మే, జులై నెలల్లో బకాయిలు జమ చేయనున్నారు.అలాగే 2024 జులై 1 నుంచి 2.73 శాతం డీఏ చెల్లించనున్నారు. దీనికి సంబంధించిన 26 నెలల బకాయిలను 2027లో నాలుగు విడతల్లో అందించనున్నారు. ఏప్రిల్, జూన్, ఆగస్టు, అక్టోబరు నెలల్లో బకాయిలు చెల్లించనున్నారు.
పింఛనుదారులకు కూడా ఇదే విధానంలో డీఏ బకాయిలను
చెల్లించాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో ఉద్యోగులు, పింఛనుదారులకు సెప్టెంబరు జీతంతోనే పెరిగిన డీఏ ప్రయోజనం అందనుంది.

## తెలంగాణలో అనలాగ్ పనీర్‌పై నిషేధం

- మొదటి పేజి తరువాయి

వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టింది.పన్నీర్ పేరుతో చలామణి అవుతున్న డైరీయేతర, కృత్రిమ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం (టీజీ సేఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చాయి.ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 30(2)(ఘ) ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలో కల్తీ పన్నీర్ తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట పడనుంది.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సముద్ర భద్రత కీలకం

- మొదటి పేజి తరువాయి

ప్రస్తుతం ప్రపంచ జనాభాలో 50 శాతం, ప్రపంచ జీడీపీలో 40 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను బ్రిక్స్ దేశాలు కలిగి ఉన్నాయని వివరించారు. ప్రపంచ జీడీపీ సుమారు 2.5 రెట్లు వృద్ధి చెందగా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి జీడీపీ ఏకంగా 4.5 రెట్లు పెరిగిందని, ఇది ప్రపంచ సగటు వృద్ధి కన్నా దాదాపు రెట్టింపు అని వెల్లడించారు.బ్రిక్స్ దేశాలు సరికొత్త ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారుతున్నాయని ప్రధాని ప్రశంసించారు. ఈ ఆర్థిక శక్తిని ప్రపంచానికి మేలు చేకూర్చే ఆచరణాత్మక పరిష్కారాలుగా మలచాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం బ్రిక్స్ సభ్య దేశాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్‌లలో ఇదే అతిపెద్దదని, దీనికి భారత్ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు.

## నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు.
బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

# మార్చి నాటికి బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లు: గడ్కరీ

- మొదటి పేజి తరువాయి

అందుబాటులోకి రానున్నాయని వెల్లడించారు. ఈ మేరకు ముబయిలో నిర్వహించిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026లో ఆయన మాట్లాడారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయం కూడా పెరుగుతుందన్నారు.టోల్‌బూత్‌ల వద్ద ఒకప్పుడు సగటున 12 నిమిషాలు వేచి ఉండాల్సి వచ్చేదని గడ్కరీ అన్నారు. కొన్ని సందర్భాల్లో 30 నిమిషాలు కూడా పట్టేదన్నారు. ఫాస్టాగ్ ) కారణంగా ఈ సమయం 80-90 శాతం తగ్గిందని తెలిపారు. బ్యారియర్లు లేని టోల్‌బూత్‌ల వల్ల ఆ సమయం ఇంకా తగ్గుముఖం పడుతుందని మంత్రి వివరించారు. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు ఏటా రూ. 10వేల కోట్లు ఆదాయం అదనంగా ప్రభుత్వానికి సమకూరుతుందన్నారు. వార్షికంగా సుమారు రూ. 5,250 కోట్ల మేర ఇంధనం కూడా ఆదా అవుతుందని చెప్పారు.బ్యారియర్లు లేని టోల్‌బూత్‌లకు సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కొనసాగుతోందని గడ్కరీ తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి 70 శాతం టోల్‌బూత్‌ల వద్ద అడ్డంకులు తొలగనున్నాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చికల్లా నూరు శాతం పూర్తవుతుందన్నారు. ప్రతిపాదిత విధానంలో మానవ ప్రమేయం లేకుండానే టోల్ వసూలు సాధ్యం కానుందని చెప్పారు. ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఙూచీూ=) సాంకేతికతను ఖీూఱఖ్త్ర ఆధారిత ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్‌తో అనుసంధానించడం ద్వారా టోల్ చెల్లించడానికి వాహనం ఆగకుండానే ఫీజు వసూలు పూర్తవుతుందని వివరించారు.

## అల్పపీడన ప్రభావంతో ఏపీలో వర్షాలు.. అప్రమత్తమైన ప్రభుత్వం

- మొదటి పేజి తరువాయి

మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు సురక్షితంగా తీరానికి చేరుకోవాలని హోం మంత్రి సూచించారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 1800 425 0101 నంబర్లను సంప్రదించాలని ప్రభుత్వం తెలిపింది.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ఘనంగా సామూహిక వరలక్ష్మివ్రతాలు



**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.11:** మండలంలోనికు ఒదులూరుగ్రామంలోశుక్రవారం గూడూరు,సారిటబుల్ ట్రస్ట్,సంస్థ హైద్రాబాద్,వారి సౌజన్యంలోశ్రావణశుక్రవారం ఘనంగా సామూహిక వరలక్ష్మివ్రతాలు నిర్వహించడం జరిగింది,ఈదీక్షలో మాతృమూర్తులు నలబైమంది భక్తిశ్రద్ధలతోదీక్షవ్రతం లోపాల్గొని,విజయవంతం గాఈకార్యక్రమాన్నినిర్వహిం చారు.వ్రతంలోపాల్గొన్న మహిళకు,ట్రస్ట్,తరుపున, పూజసామా గ్రిబటువు,చీర,జాకెట్టు, ప్రసాదాలను, పంపిణిచేశారు.అనంతరం వ్రతంవిశిష్టత,సనాతన ధర్మఔనత్యం,గురించిహిందూధర్మాలనుభక్తులకు వివరించారు.ఈకార్య క్రమంలోబిజెపిరాష్ట్రకార్య వర్గసభ్యులు,నోములరామారావు,బిజెపిజిల్లా వైస్ ప్రెసిడెంట్,నామాలశ్రీనివాసరావు,గెదశ్రీనివాస్,సామా జికకార్యకర్త)గ్రామపెద్ద,రాజబాబు,పటేల్,తదితరులు పాల్గొన్నారు.

# కాతేరులో పుష్కర ఏర్పాట్ల పై క్షేత్రస్థాయి పరిశీలన



**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**రానున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని కాతేరు ప్రాంతంలో భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చేందుకు ముందస్తు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు.
శుక్రవారం జిల్లా అదనపు ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్‌తో కలిసి కాతేరు గోదావరి తీర ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి పుష్కర ఏర్పాట్లకు అనువైన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
ఈ సందర్భంగా వి ఐ పి ల కోసం తాత్కాలిక వసతి, పార్కింగ్ సదుపాయాలు, వి ఐ పి ఘాట్, తాత్కాలిక ఘాట్లు, భక్తుల ప్రవేశ-- నిష్క్రమణ మార్గాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. భక్తులు, వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ముందుగానే గుర్తించి అవసరమైన విధంగా అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న కచ్చా రహదారిని అభివృద్ధి చేసి, ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాలకు సులభంగా చేరుకునేలా రహదారి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.కాతేరు గోదావరి తీరంలో ఘాట్‌తో పాటు మరో తాత్కాలిక ఘాట్ నిర్మాణానికి అవసరమైన అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. స్థలాలను పరిశీలించి ల్యాండ్ మార్కింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు.
పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని పార్కింగ్, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలపై సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు.
పుష్కరాల కోసం ముగిసిన తర్వాత వాటిని తొలగించడం కాకుండా, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే విధంగా శాశ్వత మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ రాహుల్ మీనా సూచించారు. ఘాట్ల నిర్మాణం, రంగులు వేయడం వంటి పనులతో మాత్రమే పరిమితం కాకుండా నది స్వచ్ఛత, భక్తుల భద్రత, పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో అదనపు ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, పుష్కర డిప్యూటీ కలెక్టర్ మహేష్, సీఐ (ట్రాఫిక్) నబీతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, పంచాయతీ, ఆర్ఎంసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజానగరం నియోజక వర్గంలో మౌలిక వసతులకు మహర్దశ

**తాగునీటికి రూ.279 కోట్లు, రోడ్లుకు రూ. 50 కోట్లు నిధులు మంజూరు**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గంలో మౌలిక వసతులకు మహర్దశ పట్టనున్నది. నియోజవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.279 కోట్లు, రోడ్ల అభివృద్ధికి రూ .50 కోట్ల నిధులు విడుదల చేస్తూ ముఖ్య రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు జీవోలు జారీ చేశారు. రాష్ట్రంలోను, జిల్లాలోను మొదటి స్థానంలో నిలిచేలాగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శుక్రవారం అయన స్వగృహంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం , అభివృద్ధి సమానంగా అమలు చేస్తుందన్నారు. రాజానగరం నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూ.279 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. అదేవిధంగా రోడ్ల అభివృద్ధికి రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో శ్రీరాంపురం, రాజమండ్రి, దివాన్ చెరువు పుణ్యక్షేత్రం , శ్రీకృష్ణపట్నం పిడింగోయ్యి, నల్గొండ, రాపాక, ముని కూడా లే కూనవరం రాజంపేట తదితర ఆర్ అండ్ బి రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మరో రూ.15 కోట్లు సాస్కి నిధులు కూడా మంజూరవుతున్నాయని త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.
నియోజవర్గంలో 16 ఘాట్లను అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో రూ.540 కోట్లతో శాశ్వతమైన అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రుడా నిధులు రూ 8.50 డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కుటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వ మని, పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ సంబంధించి రైతుల బకాయిలు రూ 32 కోట్లు బకాయిలను రైతులకు చెల్లించిందన్నారు. కోరుకొండ గ్రామ ఈనాం భూములను 22 ఏ నిబంధన నుంచి తప్పించిందన్నారు. ఎన్డీబీ నిధుల నుంచి గాదరాడ, కాపవరం, ముగ్గళ్ల ,ఆర్ అండ్ బి రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రైతులకు ఆధునిక యంత్ర పరికరాలు డ్రోన్స్, పేర్లు స్పేయర్లు, రోటవేటర్లు అందిస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బు జమా చేస్తున్నామన్నారు. సీతానగరం మండలం బొబ్బిలంక ములకలంక గోదావరి లంకపై బ్రిడ్జి నిర్మాణం నిలిచిపోవడానికి గత ప్రభుత్వంలో నిధులు మళ్లింపు జరిగాయన్నారు. నిర్మాణం పూర్తి చేయడానికి నిధులు అన్వేషణ జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యత నిస్తున్నామని, 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రణాళిక ఉందన్నారు. రెండు పీహెచ్సీ ఆస్పత్రులను రాజ నగరం పిహెచ్సి ని సిహెచ్సీ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గోదావరి జిల్లాలోనూ పరిశ్రమలు రావాల్సి ఉందన్నారు. నియోజవర్గంలో ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల కోసం కలవచర్లలో ఏర్పాటుచేసిన ఎమ్మెస్ ఎం ఈ పార్కును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మధురపూడి ఎయిర్పోర్ట్, దివాన్ చెరువు, వేమగిరి వరకు రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర రోడ్డు ఉపరిత శాఖ మంత్రి గడ్గారితో చర్చలు జరుగుతున్నాయన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి రూ.36 కోట్లతో సమగ్ర ప్రణాళిక తో టెంపుల్ టూరిజనికి చర్యలు తీసుకుంటు న్నామన్నారు. అర్హులైన ప్రజలకు ఇళ్లస్థలాలకు చర్యలు తీసుకుంటు న్నామన్నారు. కార్పొరేషన్ విలీనం అయ్యేందుకు రాజనగరం మండలంలో 12 గ్రామాలు విముఖంగా ఉన్నాయని, విడిగానే కార్పొరేషన్ కి ఎన్నికలు జరుగుతాయి అన్నారు. ఈసారి కాకుండా మరో ఐదారు సంవత్సరాల తర్వాత గ్రేటర్ రాజమహేంద్రవరం ఏర్పాటుకు అవకాశా లుంటాయన్నారు. మేయర్, కార్పొరేటర్లు, స్థానిక సంస్థల అభ్యర్థుల ఎంపిక కూటమి పార్టీల అధిష్టానాల వద్ద ఉమ్మడి చర్చల అనంతరం తుది రూపు వస్తుందన్నారు.
జనసేన నాయకులు ఆడపా శ్రీనివాస్, వేగిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రంప ఎర్రంపాలెంలో దళితులపై కుల వివక్షా?





★ **అంబేద్కర్ హాల్ పక్కనే నరకం చూపిస్తున్న డ్రైనేజీ.**
★ **సచివాలయానికి 100 మీటర్లలోనే దుర్భరం**

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 11:**-తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం రంపఎర్రంపాలెం గ్రామంలో స్వర్ణ గ్రామ సచివాలయం - 1 కి కేవలం 100 మీటర్ల దూరంలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పరిసరాలు నరకాన్ని తలపిస్తున్నాయి.హాల్ చుట్టూ ఉన్న డ్రైనేజీలో సిల్టు పేరుకుపోయి, చెత్తతో నిండి, నల్లటి మురుగు నీరు నిలిచిపోయి తీవ్ర దుర్వాసన వస్తోంది. ఈ డ్రైనేజీకి కేవలం 3 మీటర్ల దూరం చుట్టూ దళితుల నివాస గృహాలు ఉన్నాయి. దీంతో ఆప్రాంత ప్రజలు దుర్వాసన భరించలేక దోమల బెడదతో అంటురోగాల బారిన పడితే దీనికి ఎవరు బాధ్యులు అంటూ దళితులు ప్రశ్నిస్తున్నారు.

**పంచాయతీ నిర్లక్ష్యం - కుల వివక్ష ఆరోపణ:**
గ్రామ పంచాయతీకి సరిపడా సిబ్బంది ఉన్నప్పటికీ, సంవత్సరాలు తరబడి కనీసం శుభ్రం చేయలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా దళితులు నివసించే ప్రాంతం కావడంతో పంచాయితీ అధికారులు పట్టించుకోవడం లేదని, ఇది స్పష్టమైన కుల వివక్షే అని పలువురు ఆరోపిస్తున్నారు.

**ఫ్రైడే ఈజ్ డ్రైడే నిధులు ఏమవుతున్నాయి....?**
కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి శుక్రవారం "ఫ్రైడే ఈజ్ డ్రై డే" పేరుతో పారిశుధ్యం కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుంటే, ఆ నిధులన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయని, క్షేత్రస్థాయిలో పక్కదారి పడుతున్నాయని దళితులు ప్రశ్నిస్తున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలి:**
జిల్లా కలెక్టర్ గారు వెంటనే స్పందించి,రంపఎర్రం పాలెం లోని ఈ దుస్థితిని స్వయంగా పరిశీలించి, తక్షణమే డ్రైనేజీ శుభ్రం చేయించాలని,నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శి, సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నాము.

# గోదావరి కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలి

**గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు విశ్వేశ్వర రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్11**: గోదావరి పుష్కరాలలో కాలుష్య బారినుంచి గోదావరిని కాపాడే చర్యలు చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కాలుష్య సమస్యపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందనకి సమావేశం అభినందనలు తెల్పింది. నోటీసులు ఇచ్చి సరిపెట్టకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరింది. 'గోదావరి కాలుష్యం- రానున్న పుష్కరాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం పేపర్ మెయిన్ గేటు వద్ద ఉన్న శ్రీకృష్ణ సాయి కళ్యాణ మండపంలో శుక్రవారం విశ్వేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగింది. పుష్కరాలకి స్త్రీలకు, వృద్దులకు విడిగా ఒక ఘాట్ ఏర్పాటు చెయ్యాలని, పి వి.ఐ.పి. లకు ఒక ఘాట్ ,తీర్థ విధులకు 2 ఘాట్లు ఏర్పాటు చేయాలని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టికె విశ్వేశ్వర రెడ్డి కోరారు. ఎ.పి. పేపర్ మిల్లుని పుష్కరాల 15 రోజులు మూసి వేయాల న్నారు. రాళ్ళబండి మ్యూజియంను పూర్తి చేయాలని, దామెర్ల ఆర్ట్ గ్యాలరీకి మంజూరు చేసిన కోటి రూపాయలతో చిత్రపటాలన్నీ లామినేషన్ చేయించాలని కోరారు.
టిడిపి సీనియర్ నేత గన్ని కృష్ణ మాట్లాడుతూ పైపు లైన్ల కోసం రోడ్లు తవ్వేసి, పూడ్చక పోవడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ గోదావరి కాలుష్యం దారుణంగా ఉందని, గతంలో కాలుష్య నివారణకు డిపిఆర్ సిద్ధంచేసి పంపించి, రూ.88కోట్ల రూపాయలను కేంద్రం నుంచి మంజూరు చేయించామన్నారు. . దివాన్ చెర్వు దగ్గర నిర్మిస్తున్న వంతెన పుష్కరాల నాటికి పూర్తికాకపోతే ట్రాఫిక్ ఇబ్బంది వస్తుందన్నారు.
దేశిరెడ్డి బలరామనాయుడు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఇవి మూడవ పుష్కరాలు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ మాట్లాడుతూ కాలుష్య సమస్యతో పాటు ట్రాఫిక్, పుష్కర నిధులు, వంటి అంశాలను ప్రభుత్వం చర్చించాలని అన్నారు. సిపిఎం నాయకుడు టి అరుణ్ , సిపిఐ నాయకుడు టి మధు, టిడిపి నాయకుడు కాశీ నవీన్ కుమార్, పాత్రికేయులు వి ఎస్ ఎస్ కృష్ణకుమార్, కుడుపూడి పార్థసారథి, సిపి ఐ నాయకుడు నల్లా రామారావు, వి. కొండలరావు, జెటి రామారావు తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ నాయకురాలు ఆకుల భాగ్యలక్ష్మి, ఆడిటర్ వి శేషగిరి వరప్రసాద్, టిడిపి నాయకుడు బుడ్డిగ రవి, ఎస్ వివి రెడ్డి, కెవి ఆనంద్ కుమార్, ఎస్ సూరిబాబు, సీహెచ్ ఎస్ వీరభద్రారెడ్డి, ఆర్ బాలకృష్ణ, కె రాంబాబు, ఏబీఎస్ లక్ష్మణ, కె ఎస్ పట్నాయక్, ఎన్ అప్పారావు, ఎండి షరాన్, ఎస్ లలిత, బివివి గిరి, ఏ వెంకటేశ్వరరావు, జె రాంబాబు, వై శ్రీనివాస్, బివిఎన్ పూర్ణిమరాజు, తదితరులు పాల్గొన్నారు.

# కూనవరంలో చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా



**-ప్రభుత్వ పాఠశాల, విక్టోరియా మాంటిస్సోరి మొదటి స్థానం**

**కూనవరం,పెన్ పవర్ సెప్టెంబర11.** కూనవరం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు-2026 ను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజయవంతం గా నిర్వహించారు.పాఠశాల ప్రధా నోపాధ్యాయులు చిచ్చడి అప్పారా వు,పి భవాని,చిచ్చడి చంద్రరావు పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల,ప్రైవేట్ విభాగం నుండి విక్టోరియా మాంటీ స్సోరి మొదటి స్థానాలు సాధించా యి.విజేతలకు కూనవరం ఎంపీడీ వో ఎస్ ఆశీర్వాదం చేతుల మీదు గా సర్టిఫికెట్లు అందజే శారు.మండ ల స్థాయిలో గెలిచిన విద్యార్థులు సెప్టెంబర్ 27న రంపచోడవరంలో జరిగే జిల్లా స్థాయి సంబరాల్లో పాల్గొంటారని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పి కన్నారా వు తెలిపారు.కార్యక్రమంలో పాఠశా ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మండలంలోని గ్రామాల్లో దోమతెరలుపంపిణీ

**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.11** :జిల్లాకలెక్టర్,జిల్లాప్రాజెక్టుఅధికారిఆదేశాలమేరకు జిల్లామలేరియాఅధికారి,డిప్యూటీ డిఎంహెచ్ఓ ఆధ్వర్యంలోమండల కమిటీసభ్యులద్వారాదోమ తెరలుపంపిణీకార్యక్రమం జరుగును.మలేరియా ప్రభావితప్రాంతాల్లోమొదటి విడత దోమతెరలు పంపిణీకార్యక్రమం పూర్తయిందని,రెండోవిడతలో జీడిగుప్ప, తదితరగ్రామాల్లో రేపటినుండిదోమల దోమతెరలపంపిణీ కార్యక్రమంలో స్థానిక పెద్దలు సర్పంచ్,ఎంపీపీ,జడ్పిటిసి,ఎంపీటీసీలు,హానరబుల్ మెంబర్స్,మెడికల్ ఆఫీసర్,నోడల్ ఆఫీసర్,ఎస్.యు.ఓ మలేరియాఆర్గనైజర్,ఈఓపిఆర్.డి,సీడీపీఓ,ఎం.ఎం.ఎస్. మెంబర్స్,పాల్గొని ,జయప్రదంచేయాలని,కోరారు.ఈక్రింది గ్రామాల్లో దోమతెరలు పంపిణీకార్యక్రమం జరుగును.
13.వ.తేదీనమొద్దులగూడెం,15.వతేదీనసీతంపేట, 16.వతేదీనశ్రీరామగిరి,17.వ.తేదీనచొక్కనపలి,18. వతేదీనకొత్తూరు,19.వ.తేదీనరాజుపేటగొమ్ము,21. వతేదీనరాజుపేటకాలనీ,22.వ.తేదీనపాతరాజుపేట, 23.వ.తేదీనకల్లునూరు,24.వ.తేదీనమరేడుపూడి, తదితరగ్రామాల్లో పంపిణీకార్యక్రమం జరుగుతుందని ఒకప్రకటనలోతెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగురవేస్తాం.






వడ్డి రఘురామ్ నాయుడు

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11.**పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక సంస్థలు ఎన్నికల సన్నాహాలపై నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.క్రొత్తగా ఐడీ కార్డులు మంజూరైన వైసీపీ నాయకులు కార్యకర్తలకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. వెన్నుపోటు పార్టీ వెన్నుపోటు పాలన కార్యక్రమం ద్వారా గతంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు వివరించారు. గ్రామస్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి వరకు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను బలంగా ఎదుర్కొందామన్నారు. ప్రతిపక్షం మనకు కొత్త ఏమీ కాదని, 2014లో మన పార్టీ గెలవకపోయినా, ఎవరూ అధైర్యపడలేదన్నారు. కలిసికట్టుగా పనిచేసి 2019లో విజయం సాధించామని, వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. కుల, మత, ప్రాంత, రాజకీయాలు చూడకుండా పథకాలు అందజేశామన్నారు. ప్రజా సేవే పరమావధిగా పని చేశామని,. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని, కానీ ఐదేళ్లలో మనం చేసిన మంచిని బలంగా చెప్పుకోలేకపోయామన్నారు. ఐదేళ్ల వైయస్ఆర్ సీపీ పాలనలో కొన్ని విషయాల్లో మనం వెనుకపడ్డామన్నారు. భవిష్యత్‌లో అలాంటి పరిస్థితి రాకుండా చూసుకుందామన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తే అధినేత అని, ఈ విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని, కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని ముందుకు వెళ్తున్నారన్నారు. రెండేళ్ల పాలన అవినీతి నిలయంగా మారిపోయిందన్నారు. మట్టి, ఇసుక, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోందన్నారు. స్థానిక ఎన్నికల్లో తప్పకుండా గెలవాలన్నారు. అందరూ ఐక్యమత్యంగా ఉందామని, పార్టీ నియమించిన అభ్యర్థులను గెలిపిద్దామని కలిసికట్టుగా గ్రామాల్లో అధికార పార్టీని ఎదుర్కొందామన్నారు. బహుశా అక్టోబర్ లేదా నవంబర్ నెలలో ఎన్నికలు ఉంటాయని,. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా ప్రతినిధుల అవినీతితోపాటు సూపర్ సిక్స్ సహా 143 హామీలపై నిలదీద్దామన్నారు.. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు, కూటమి పరిపాలన వ్యత్యాసాన్ని ప్రజలకు వివరిద్దామన్నారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని, డీఎస్సీలో జరిగిన అక్రమాలు రోజుకొకటిగా బయటపడుతుంటే, అనర్హులే గురువులుగా నియమితులయ్యారని ప్రభుత్వం రహస్య విచారణలతోనే తేల్చేస్తోందన్నారు.. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు రిజర్వేషన్లతో నడిపిన మెగా డీఎస్సీ పూర్తిగా అక్రమాల పుట్టగా మారిపోయిందన్నారు. నీట్ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకున్నట్లుగానే, రాష్ట్రంలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ లోకేష్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. దేశంలోనే అత్యంత అవినీతిమయమైన పాలనను చూస్తున్నామన్నారు. 2025 ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి పోస్టింగులు ఇచ్చే వరకు ప్రతి అడుగునా అడ్డగోలు అవకతవకలకు పాల్పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ స్థాయి నాయకులు, మరియు పట్టణ,మండల, నాయకులు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు..



# సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, సెప్టెంబర్ 11;** పేద మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు భారం తగ్గించేందుకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. శుక్రవారం బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుక్కునూరు మండలానికి చెందిన పల్లెల మారేశ్వరికి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గానికి 28వ విడతగా 51 చెక్కులు మంజూరయ్యాయని, మొత్తం 83 లక్షల 23 వేలు విలువైన చెక్కులను లబ్ధిదారులకు ఇళ్లకు నేరుగా వెళ్లి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మంత్రి గోపాలకృష్ణ, చల్ల కోటి, గాడిద వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, సెప్టెంబర్ 11;** ఎవరైనా ఆన్లైన్ యాప్ మోసాలకు గురి అయినట్లయితే వెంటనే 19 30 కి కాల్ చేసి మీ సమస్యను తెలియజేయాలని జీలుగుమిల్లి సిఐ బి యాదగిరి సూచించారు. శుక్రవారం జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్లో పోలీసు సిబ్బందికి పోరాంతపు శిక్షణ నిర్వహించి, సెంటర్లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అప్రమత్తంగా ఉండాలని డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల బారిన పడకుండా మంచి మార్గాన పయనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిలుగుమిల్లి ఎస్ఐ వి క్రాంతి కుమార్, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 9 వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేది వరకు జాతీయ పోషకాహార మాసోత్సవములు



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11.**సెప్టెంబర్ 9 వ తేదీ నుంచి అక్టోబర్ 8వ తేది వరకు జరిగే జాతీయ పోషకాహార మాసోత్సవములు 16వ వార్డ్ లో నిర్వహించరు. ఈ కార్యక్రమంలో పోషకాహార ప్రాముఖ్యత గురించి వివరించడం జరిగింది ఈ కార్యక్రమం అన్ని అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించి తల్లులకు తల్లులకు పోషకహారం యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం జరుగుతుంది అని దాన్లో భాగంగా అంగన్వాడి వర్కర్లు, ఏఎన్ఎం లు, ఆశా కార్యకర్తలు అందరూ కూడా తమ పరిధిలోని తల్లిలందరికీ పోషకహర ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని ఎక్కువ మాంసపుకృతులు కలిగిన ఆహారం గురించి తెలియజేసి వాటిని వారియొక్క రోజువారీ ఆహారం లో తప్పనిసరిగా తీసుకోవాలని తెలియజేయాలనీ తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్స్ సిహెచ్ దుర్గ భవాని, అంగన్వాడీ వర్కర్స్ మరియు తల్లులు హాజరైనారు.

### బొడ్డగండి పంచాయతీ పరిధిలో ప్రత్యేక పెన్షన్ క్యాంపులు

**వై రామవరం/ గుర్తేడు, పెన్ పవర్,సెప్టెంబర్ 11 :** గుర్తేడు మండలం పరిధిలో ఉన్న బొడ్డగండి పంచాయతీ లో ప్రత్యేక పెన్షన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి కే బాపన్న దొర తెలిపారు.

ఆయన తెలిపిన వివరాలు ప్రకారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం బొడ్డగండి పంచాయతీ మారుమూల 13 గ్రామాలలో ప్రత్యేక పెన్షన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈనెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు అర్హులైన పింఛన్దారులందరూ ఆధార్ కార్డ్ రేషన్ కరెంట్ బిల్లు ఓటర్ ఐడి తో రావాలని అన్నారు. ఆయా పంచాయతీ సెక్రటరీ డిజిటల్ అసిస్టెంట్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈ కార్యక్రమానికి విధిగా హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

# రామచంద్రపురంలో జనసేన జోష్..





**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11.**రామచంద్రపురంలోని చందమామ కళ్యాణ మండపం, రాజగోపాల్ సెంటర్ నందు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అధ్యక్షతన రామచంద్రపురం నియోజకవర్గ సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది.అమలాపురం పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తగా బొలిశెట్టి శ్రీనివాస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్చించి, సమన్వయంతో ముందుకు సాగేందుకు అవసరమైన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

రామచంద్రపురం నియోజకవర్గంలో జనసేన జెండాలు రెపరెపలాడగా...

జనసేన నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం వెల్లివిరిసింది!

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ స్థానిక నాయకులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వీర మహిళలు మరియు ప్రెస్ ఒ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

## మాంటిస్సోరి హైస్కూల్లో ఘనంగా ఏకో ఫ్రెండ్లీ వినాయక చవితి





**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**తాళ్లపూడి మాంటిస్సోరి హైస్కూల్లో ఏకో ఫ్రెండ్లీ వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు మట్టి వినాయక ప్రతిమలను ప్రదర్శించారు. పర్యావరణ పరిరక్షణపై చిన్నారుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో మట్టి వినాయకుడిని పూజించే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వి.వి.అనీష్ తెలిపారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుర్తేడు లో వి బి జి రాంజీ మండల ఆఫీస్

**వై రామవరం /గుర్తేడు, పెన్ పవర్, సెప్టెంబర్ 11 :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గుర్తేడు మండలంలో మండల ఆఫీసులన్నీ తరలించాలనే భాగంలో మొదటగా వి బి జి రాంజీ ఆఫీసును ప్రారంభించడం జరిగిందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు.

వి బి జి రామ్ జి ఆఫీస్ గుర్తేడులో ప్రారంభించడం వలన అన్ని సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## వినాయక చవితి సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాల పంపిణీ.







**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11.**రాబోయే వినాయక చవితి పండుగ 14-09-2026 సందర్భంగా, తాడేపల్లిగూడెం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం చేపట్టారు.ఈరోజు మున్సిపల్ కార్యాలయంలో స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ఎం. యేసుబాబు మున్సిపల్ సిబ్బందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ యేసుబాబు రానున్న వినాయక చవితి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని, పిఒపీ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలనే ఉపయోగించాలని పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాల వల్ల జల కాలుష్యం జరగదని తెలిపారు. పట్టణ ప్రజలందరూ 14వ తేదీన జరిగే వినాయక చవితి పండుగలో మట్టి గణపతులనే పూజించాలని పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి భవాని బాబు , అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి సీతారం, మున్సిపల్ మేనేజర్ పి ప్రసాద్, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు మేనేజర్ నాగరాజు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రీ-సర్వే ఆన్‌లైన్ ప్రక్రియపై శిక్షణ

- 33 గ్రామాల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందికి అవగాహన
- ఆర్డీవో కె.ఆనందరావు





**కొవ్వూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**రీ-సర్వే ప్రక్రియను మరింత వేగవంతంగా, కచ్చితత్వంతో పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బందికి ఆన్‌లైన్ లాగిన్‌లలో డేటా నమోదు విధానంపై సమగ్ర అవగాహన కల్పించారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో రీ-సర్వే ఫేజ్--4, ఫేజ్--5లో ఉన్న మొత్తం 33 గ్రామాలకు చెందిన గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్లకు శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో కె. ఆనందరావు అధ్యక్షతన జరిగిన ఈ శిక్షణలో రీ-సర్వేలోని వివిధ దశలకు సంబంధించి సంబంధిత ఆన్‌లైన్ లాగిన్‌లను ఏ విధంగా వినియోగించాలి, ఏ లాగిన్‌లో ఎలాంటి వివరాలను నమోదు చేయాలి, డేటాను ఏ దశలో అప్‌లోడ్ చేయాలనే అంశాలపై సిబ్బందికి దశలవారీగా అవగాహన కల్పించారు. రీ-సర్వే ప్రక్రియలో భూ వివరాల నమోదు, డేటా అప్‌లోడ్, వివిధ దశల ఆన్‌లైన్ ప్రక్రియలు కీలకమైనందున సిబ్బంది లాగిన్‌ల వినియోగంలో పూర్తి స్పష్టత కలిగి ఉండాలని అధికారులు సూచించారు. ఒక దశలో నమోదు చేయాల్సిన సమాచారాన్ని మరో లాగిన్‌లో నమోదు చేయకుండా, నిర్దేశిత విధానాలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. ఫేజ్--4, ఫేజ్--5 గ్రామాల్లో రీ-సర్వే పనులు సజావుగా ముందుకు సాగేలా క్షేత్రస్థాయి సిబ్బంది ఎదుర్కొనే సాంకేతిక సందేహాలను నివృత్తి చేయడం, ఆన్‌లైన్ ప్రక్రియలో పొరపాట్లను తగ్గించడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. రీ-సర్వే ప్రక్రియలో సర్వేయర్ నుంచి తహసీల్దార్ వరకు ప్రతి స్థాయిలో ఆన్‌లైన్ డేటా నమోదు, పరిశీలన, తదుపరి దశకు పంపించే ప్రక్రియపై స్పష్టత ఉండటం ద్వారా భూ రికార్డుల నవీకరణ మరింత కచ్చితంగా, పారదర్శకంగా జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రీ-సర్వే డిప్యూటి తహశీల్దార్లు, 33 గ్రామాలకు చెందిన గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, కలెక్టరేట్ సెక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి పరీక్షలలో స్వర్ణ భారతి విద్యార్థుల ప్రతిభ



**కొవ్వూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**కొవ్వూరులోని జడ్పీహెచ్ హైస్కూల్లో జనవిజ్ఞాన వేదిక వారిచే నిర్వహించిన చెకుముకి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన ధర్మవరంలోని స్వర్ణభారతి స్కూల్ విద్యార్థులు. ఇల్లూరి రేష్మ, తాడి భార్గవ్, సత్యం యుగంధర్ లు మండలస్థాయిలో ద్వితీయస్థానం సాధించారు. విజయం సాధించిన విద్యార్థులకు ఆ స్కూలు ప్రధానోపాధ్యాయినిచే సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది. ఈ విద్యార్థులను స్వర్ణ భారతి స్కూల్ కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణరాజు, ఉపాధ్యాయులు అభినందించడం జరిగింది.

# అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం

- ప్రజా చైతన్యంతోనే మార్పు సాధ్యం
- శాంతి భద్రతల సమస్యపై రౌండ్ టేబుల్ సమావేశం లో మేధావులు, నేతలు వెల్లడి





**రాజమహేంద్రవరం పెన్ పవర్,సెప్టెంబర్ 11:**గత రెండున్నర సంవత్స రాలుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని, బాలికలు, మహిళలకు, దళిత, బలహీన వర్గాలకు భద్రత లేదని పలువురు మేధావులు, రాజకీయ నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్లు, మద్యం విక్రయా లతో నేరాల రేటు పెరిగింద న్నారు. కుటమి పార్టీల ప్రజాప్రతినిధులే నేరాల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం ప్రజలకు ఆందోళనకు గురిచేస్తుందన్నారు. వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్ అధ్యక్షతన స్థానిక తిలక్ రోడ్ లోని రెడ్డి కన్వెన్షన్ సెంటర్ లో శుక్రవారం కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతల సమస్య పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు మేధావులు, రాజకీయ నేతలు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్ట పరిధిలో పాలన జరగాలని అయితే రాష్ట్రంలో విరుద్ధంగా రెడ్ బుక్కు రాజ్యాంగం అమలవుతుందని విమర్శించారు. మాజీ డి జి పి కూచిపూడి భాస్కరరావు మాట్లాడుతూ,రాజకీయాలు పక్షాలు ప్రక్షాళన జరగాలని, నిజాయితీ గల ప్రజాప్రతి నిధులను ఎన్నుకోవాల్సిన ఆవశ్యకత ప్రజలపై ఉందని అనాడే సమాజంలో శాంతిభద్రతలను కాపాడు కోగలమన్నారు. శాంతి భద్రతలను, పౌర హక్కులను ముఖ్యమంత్రి నిరంతరం పరిరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. మాజీ సమాచార శాఖ కమిషనర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతి నిదుల చేతిల్లో కీలుబొమ్మగా మారిందని మండిపడ్డారు. రాజకీయ ఒత్తుడులు పెరిగితే అమాయకులపై నేరాల తీవ్రత పెంచుతున్నారని, ఇటువంటి సంఘటనలు ప్రజా తిరుగుబాటుకు దారితీస్తాయని హెచ్చరిం చారు. మాజీ ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్లు, మద్యం విక్రయాలు విచ్చలవిడిగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఒక్క నెలలోనే ఐదారు హత్యలు, నేరాలు ఘోరాలు ఎన్నో జరిగాయ న్నారు. నేరస్తులకు శిక్ష పడేందుకు సీసీ పుటేజీ లను నిల్వ ఉండేలా నిర్దిష్టమైన చట్టాన్ని ప్రభుత్వం తీసుకురా వాలన్నారు. పోలీసులే మహిళలను, దళిత మహిళలను, అమా యకులపై దౌర్జన్యాలకు, దాడులకు దిగుతున్నారని, లాక్ అప్ డెత్ లకు గురి చేస్తున్నారని విమర్శించారు. హైకోర్టు న్యాయవాది రజిని మాట్లాడుతూ నేతలు, ప్రజాప్రతి నిధులు మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, కూటమి ప్రభుత్వ పెద్దలు వారిని కాపాడుతున్నారని విమర్శించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహిళలపై చెయ్యి పడితే నేరస్తులకు అదే చివరి రోజు అని ప్రగల్బాలు పలకడం తప్ప వాస్తవంలో కార్యాచరణ లేదన్నారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, అక్రమాలు, అన్యాయాలను ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ చైతన్యం తోనే సమాజంలో మార్పు తీసుకు రాగలమన్నారు. ప్రముఖ విద్యావేత్త వసుంధర మాట్లాడుతూ ఏ ప్రభుత్వంలో అయినా రాజ్య హింసను ఖండిస్తున్నామన్నారు.పెద్ద పెద్ద దొంగలకు రాచ మర్యాదలు చేస్తూ, చిన్న చిన్న దొంగలపై పోలీస్ శాఖ విధులను దుర్వినియోగం చేయడం ఆనవాయితీగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సంచలమైన నేరాల్లో సీసీ పుటేజీల మాయం చేయడం పోలీసులు పనిగా పెట్టుకున్నారన్నారు. ఈ సమావేశంలో పలువురు నేతలు మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ గూడూరు శ్రీనివాస్, ఎం.షర్మిలారెడ్డి , అశోక్ కుమార్ జైన్, డి.బలరామ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు విఫలం చెందాయని, రాష్ట్రంలో గంజాయి, బ్లేడ్ బ్యాచూలు వీర విహారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజాప్రతినిధులు నేరాల్లో పాలుపంచుకుంటుడం పై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సమావేశానికి వచ్చి మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ సమావేశంలో కాకుమాను ఉమ వలీ, పెద్దిరెడ్డి శ్రీనివాసు, సత్యనారాయణ లక్ష్మీనారాయణ, వట్టికూటి కృష్ణవేణి, వాసంశెట్టి గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నివీర్ వాయుగా గోపాలకృష్ణ ఎంపిక టీబీఆర్‌కు గర్వకారణం -- టీబీర్ చైర్మన్ భోగేశ్వరవు




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11:**అప్పారావుపేటకు చెందిన శ్రీమతి నాగలక్ష్మి కుమారుడు నేరుటూరి గోపాలకృష్ణ, ప్రస్తుతం టీబీఆర్ జూనియర్ కళాశాల ఽ డిఫెన్స్ అకాడమీలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతున్నాడు. గోపాలకృష్ణ భారత వైమానిక దళం నిర్వహించిన రాత పరీక్ష, శారీరక సామర్థ్య పరీక్ష, అడాప్టబిలిటీ/ప్రాక్టికల్ పరీక్షలతోపాటు బెంగళూరులో జరిగిన తుది వైద్య పరీక్షను కూడా విజయవంతంగా పూర్తి చేసి, అగ్నివీర్‌వాయుగా భారత వైమానిక దళానికి ఎంపికయ్యాడు. అతను నియామక పత్రాన్ని కూడా అందుకొని, 2027 జనవరి 1 నుంచి శిక్షణలో చేరనున్నాడు. ఈ ఘన విజయాన్ని సాధించిన గోపాలకృష్ణను నేడు మా అకాడమీలో హృదయపూర్వకంగా అభినందించి, శాలువాతో సత్కరించడం ఎంతో ఆనందాన్ని, గర్వాన్ని కలిగించింది అని టీబీర్ చైర్మన్ భోగేశ్వరవు అన్నారు.అతని విజయం వెనుక నిలిచిన మాతృమూర్తి శ్రీమతి నాగలక్ష్మికి, అధ్యాపక బృందానికి, మామయ్య శ్రీను కి మరియు శిక్షకులకు హృదయపూర్వక అభినందనలు. గోపాలకృష్ణా నీ క్రమశిక్షణ, కఠోర శ్రమ, పట్టుదల మరియు దేశసేవ పట్ల ఉన్న అంకితభావం ఇతర విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. భారత వైమానిక దళంలో ఉజ్వల భవిష్యత్తును సాధించి, తల్లిదండ్రులకు, టీబీఆర్ సంస్థలకు మరియు భారతమాతకు మరింత గర్వకారణంగా నిలవాలని హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను అన్నరు.

## మట్టి వినాయక ప్రతిమలను తయారు చేసిన విద్యార్థులు తయారు చేసి ప్రత్యేక పూజలు



**పెన్ పవర్ నిడమర్రు మండలం పెదనింద్రకొలను సెప్టెంబర్ 11:**నిడమర్రు మండలం పెదనింద్రకొలనులోని సరస్వతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను స్వయంగా తయారు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో శుక్రవారం విద్యార్థులు ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు తమ చేతులతో తయారు చేసిన మట్టి వినాయక ప్రతిమలను అందంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం కోలాటం, భజనలు, భక్తిగేయాలతో సందడి చేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా మట్టి వినాయక ప్రతిమలను తయారు చేయించినట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. ఇందిరా పర్యవేక్షణలో విద్యార్థులు మట్టి ప్రతిమలను తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## గణపతి నవరాత్రుల ఉత్సవాలు ఏర్పాట్లుకు సిద్ధంకండి.

షామియానా సప్లై దారులకు అసోసియేషన్ అధ్యక్షులు పిలుపు.




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11:** తాడేపల్లిగూడెం పట్టణ షామియానా ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలవారీ సమావేశం పట్టణ అధ్యక్షులు శిరంగుల నరసింహ మూర్తి అధ్యక్షతన 1 టౌన్, 4 వ వార్డు లో వున్న మామిడి తోట లోని పి. ఎల్.ఎన్. షామియానా షాపు ఆవరణలో జరిగింది. ఈ సమావేశం లో పట్టణ అధ్యక్షులు శిరంగుల నరసింహ మూర్తి మాట్లాడుతూ ఈ నెల 14 తేది నుండి గణపతి నవరాత్రులు ప్రారంభం అవుతున్న దృశ్యా పట్టణం లోని గణేశుని దేవాలయాల వద్ద, మెయిన్ సెంటర్ లలో, నాలుగు రోడ్ల కూడళ్ళలో మరియు వీధుల్లో గణపతి ఉత్సవాలు జరిపే కమిటీ లకు సామాన్లు సరఫరా చేసి నగదు తో పాటు ఆ వినాయకుని అనుగ్రహం పొందాలని సభ్యులకు విజ్ఞప్తి చేశారు . ఈ ఏర్పాట్లు కు అవసరం అయితే ఒకరికొకరు పరస్పరం సహకరించుకోవాలని సభ్యులకు సూచించారు. పట్టణ ప్రజలందరూ ఈ ఉత్సవాలు కు మట్టి తో తయారు చేసిన "వినాయక ప్రతిమలు " నే వాడాలని, రంగులు తో తయారు చేసిన విగ్రహాలు నిమజ్జనం చేసినపుడు నీరు కలుషితం అవ్వుతుందని, దయచేసి అందరు మనవంతు భాధ్యతగా మట్టి వినాయక ప్రతిమలు వాడి, నీటి కాలుష్యం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా షామియానా అసోసియేషన్ కోశాధికారి పట్నాల రామకృష్ణ, పట్టణ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు నమ్మి నాగేశ్వరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి కాళ్ళ రవి, సహాయ కార్యదర్శి పోలిశెట్టి లక్ష్మీనారాయణ, కోశాధికారి యాపాడ ప్రకాష్, సంఘ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ బత్తిన శ్రీనివాస్, కాసిలింక వెంకట నారాయణ ( వాసు ), సభ్యులు గట్టు సురేష్, మన్యం బాలాజీ, తన్నీడి నరేష్, నమ్మి ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు

## యువమోర్చా ప్రెసిడెంట్ కంచర్ల రాజా పుట్టినరోజు సందర్భంగా పేదల కు చీరలు పంపిణీ



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11**ఈతకోట భీమశంకరరావు తాతాజీ ఆధ్వర్యంలో పట్టణ యువమోర్చా ప్రెసిడెంట్ కంచర్ల రాజా పుట్టినరోజు వేడుకలు కంచర్ల రాజా నివాసంలో నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిజెపి ఇన్‌చార్జ్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఈతకోట భీమశంకరరావు తాతాజీ శాలువాతో సత్కరించి బొకే ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. పుట్టినరోజు సందర్భంగా ఇలా సేవ కార్యక్రమం చేయడం అభినందనియం తాతాజీ అన్నారు. ఈ సందర్భంగా కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు రాజా అభిమానులు మిత్రులు వార్డ్ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

# శాస్త్రీయ ఆలోచనలకు 'చెకుముకి' వేదిక!





- పోలవరం జిల్లాలో ఘనంగా ముగిసిన మండల స్థాయి సైన్స్ సంబరాలు
- 11 మండలాల్లో 84 పాఠశాలలు.. 84 బృందాల భాగస్వామ్యం
- జిల్లా స్థాయి పోటీలకు 14 పాఠశాలలు ఎంపిక

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు ప్రశ్నించే తత్వం, పరిశీలనా శక్తి, సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు--2026లో భాగంగా పోలవరం జిల్లాలో మండల స్థాయి పోటీలు విజయవంతంగా ముగిశాయి. జిల్లాలోని 11 మండలాల్లో నిర్వహించిన ఈ సైన్స్ సంబరాలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు.

జిల్లా వ్యాప్తంగా 84 పాఠశాలలు, 84 బృందాలు మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నాయి. వీటిలో 81 ప్రభుత్వ పాఠశాలలు, 3 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో నిర్వహించిన పాఠశాల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి మండల స్థాయిలో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

### జిల్లా స్థాయి పోటీలకు 14 పాఠశాలలు

మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన పాఠశాలల్లో 11 ప్రభుత్వ పాఠశాలలు, 3 ప్రైవేటు పాఠశాలలు జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యాయి. మొత్తం 14 పాఠశాలలు సెప్టెంబర్ 27న నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయి.జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన ప్రతి పాఠశాల నుంచి 8వ, 9వ, 10వ తరగతులకు చెందిన ఒక్కొక్క విద్యార్థి చొప్పున ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారు. జిల్లా స్థాయి పోటీల అనంతరం ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఒక టాపర్ పాఠశాలను, ప్రైవేటు పాఠశాలల విభాగంలో మరో టాపర్ పాఠశాలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు పంపించనున్నారు.

### మండలాల్లో ఉత్సాహంగా నిర్వహణ

రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం, రాజవొమ్మంగి, వై.రామవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, చింతూరు, వీఆర్ పురం, ఎటపాక, కూనవరం మండలాల్లో జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ నాయకులు సమన్వయంతో సైన్స్ సంబరాలను నిర్వహించారు.

రంపచోడవరంలో జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు, యుటిఎఫ్ పోలవరం జిల్లా అధ్యక్షులు జి. విశ్వరాజు, మండల అధ్యక్షులు సనాతన బాబు, జిల్లా కార్యదర్శి సూరిబాబు, మండల ప్రధాన కార్యదర్శి వెంగల్‌రావు పాల్గొన్నారు. అడ్డతీగలలో యుటిఎఫ్ నాయకులు మంగరాజు, గాంధీ తదితరులు, గంగవరంలో జన విజ్ఞాన వేదిక నాయకులు ఎం. వెంకన్న దొర, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, బొజ్జిదొర పాల్గొన్నారు.రాజవొమ్మంగిలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు టి. బొజ్జియ్య, యుటిఎఫ్ మండల అధ్యక్షులు గొలగాని శ్రీను, జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు మైలబోయిన రాంబాబు, యుటిఎఫ్ నాయకులు దాసరి పైడిమల్లి తదితరులు పాల్గొన్నారు. వై.రామవరంలో జన విజ్ఞాన వేదిక కోశాధికారి, మండల అధ్యక్షులు నెరం వెంకటరమణ, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌రెడ్డి, దేవీపట్నంలో జన విజ్ఞాన వేదిక నాయకులు బి. దేవుడు, కారం శ్రీను, మారేడుమిల్లిలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు. చింతూరులో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి బొగ్గ ముత్తయ్య, గౌరవ అధ్యక్షులు పండ కృష్ణయ్య, వీఆర్ పురంలో కె. వెంకటేశాయ ఆధ్వర్యంలో, ఎటపాకలో యుటిఎఫ్ నాయకులు కె. శ్రీనివాసు, రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో, కూనవరంలో జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పి. కన్నారావు, సిహెచ్. సుందర్‌రావు తదితరుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు.

### అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు

మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొని పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు. విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించారు.రాజవొమ్మంగిలో నిర్వహించిన మండల స్థాయి పరీక్షకు మండల విద్యాశాఖ అధికారి--1 కారం వీర వెంకట సత్యనారాయణ దొర, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ఆరుమిల్లి ఆదిలక్ష్మి తదితరులు హాజరై పరీక్ష నిర్వహణను పరిశీలించారు.

### ప్రతి విద్యార్థికి ప్రోత్సాహం

పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో పాటు పాల్గొన్న ప్రతి విద్యార్థిని ప్రోత్సహించేలా మెమొంటోలతో సత్కరించారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి జన విజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో పాల్గొన్న ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, పరిశీలనా శక్తి, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతో దోహదపడుతున్నాయని తెలిపారు. పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా ప్రయోగాత్మకంగా ఆలోచించడం, ప్రతి విషయాన్ని ప్రశ్నించడం, సమస్యలకు శాస్త్రీయ దృక్పథంతో పరిష్కారాలు అన్వేషించడం విద్యార్థులు అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. సెప్టెంబర్ 27న జరిగే జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో ఎంపికైన 14 పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నాయి.

# శాస్త్రీయ ఆలోచనలకు చెకుముకి వేదిక!





- గంగవరం ఎంఆర్‌సీలో మండల స్థాయి టాలెంట్ టెస్ట్
- 8 ఉన్నత పాఠశాలల విద్యార్థుల ఉత్సాహభరిత పాల్గొనడం
- జిల్లా స్థాయి పోటీలకు గంగవరం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థుల ఎంపిక

**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు విజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవడంతో పాటు పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ నాయకులు సూచించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, ప్రశ్నించే తత్వం, పరిశీలనా శక్తిని పెంపొందించడమే లక్ష్యంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు--2026లో భాగంగా శుక్రవారం గంగవరం మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. గంగవరం మండల విద్యా వనరుల కేంద్రం (ఎంఆర్‌సీ)లో నిర్వహించిన ఈ పోటీలకు మండలంలోని 8 ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా హాజరై తమ ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మండల స్థాయి పోటీలకు ఎంపిక చేసి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

### ముగ్గురు విద్యార్థుల ప్రతిభ

మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు కె. పృథ్వీ శ్రీ వల్లభ దొర, పి. మహంతి దేవి, అనుపోజు భాను ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరు మండల స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో గంగవరం మండలం తరఫున పాల్గొని తమ ప్రతిభను చాటుకోనున్నారు.

### విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి

ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక, యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. మారుతున్న సాంకేతిక, పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు తమ విజ్ఞానాన్ని విస్తరించుకోవాలని సూచించారు. పుస్తకాల్లోని విషయాలను చదవడమే కాకుండా ప్రతి అంశాన్ని ప్రశ్నిస్తూ, పరిశీలిస్తూ, ప్రయోగాత్మకంగా ఆలోచించే అలవాటును పెంపొందించుకోవాలని అన్నారు.విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పోటీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు శాస్త్రవిజ్ఞానంపై ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు.

### పాల్గొన్న వారికి జ్ఞాపికలు, బహుమతులు

మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జ్ఞాపికలు, బహుమతులతో అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను గుర్తించడం ద్వారా భవిష్యత్తులో మరింతగా రాణించేందుకు ప్రోత్సాహం లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కన్వీనర్, యుటిఎఫ్ నాయకులు ఎం. వెంకన్న దొర, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కె. బుజ్జిదొర, ప్రధాన కార్యదర్శి సి.హెచ్. రామకృష్ణారెడ్డి, జిల్లా కౌన్సిలర్ సి.హెచ్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫేజ్--4, ఫేజ్--5 రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

ఆర్డీవో ఆర్. శివ రాముడు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**

రెవెన్యూ డివిజన్ పరిధిలో ఫేజ్--4, ఫేజ్--5 కింద చేపడుతున్న రీ-సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు సమన్వ యంతో పనిచేయా లని రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ఆర్. శివ రాముడు సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఫేజ్--4, ఫేజ్--5 రీ-సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లుగా సాహిల, డిప్యూటీ తహసీల్దార్, ఛాయాదేవి, సర్వేయర్ పాల్గొని రీ-సర్వే ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, రికార్డుల నమోదు, సంబంధిత లాగిన్‌లలో చేపట్టాల్సిన ప్రక్రియపై సిబ్బందికి శిక్షణ అందించారు.150 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 13 మండలాలు/ప్రాంతాల్లో మొత్తం 162 గ్రామాలు ఉండగా, ఇప్పటివరకు 150 గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియ పూర్తయింది. ఈ గ్రామాల్లో సుమారు 3,20,235.547 ఎకరాల విస్తీర్ణంలో రీ-సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.ఫేజ్--4 కింద 5 గ్రామాల్లో, సుమారు 25,345.700 ఎకరాల విస్తీర్ణంలో రీ-సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో టిపిఎచ్--3, ఆర్డిఓ--2 లాగిన్‌లలో ప్రక్రియ పురోగతిలో ఉంది. అదేవిధంగా ఫేజ్--5 కింద మరో 5 గ్రామాల్లో, సుమారు 13,270.083 ఎకరాల విస్తీర్ణంలో రీ-సర్వే కొనసాగుతోంది. వివిధ లాగిన్‌లలో నమోదుల ప్రక్రియ పురోగతిలో ఉన్నట్లు అధికారులు వివరించారు.

మిగిలిన గ్రామాల్లోనూ రీ-సర్వేకు చర్యలు రీ-సర్వే పెండింగ్‌లో ఉన్న రాజమహేంద్రవరం అర్బన్ ప్రాంతం, మండపేట మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు/ప్రాంతాల్లో కూడా ప్రక్రియను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో సూచించారు. వీటి పరిధిలో సుమారు 10,354.22 ఎకరాల విస్తీర్ణం ఉన్నట్లు తెలిపారు.




ఇనాం భూముల రికార్డులపై ప్రత్యేక దృష్టివిలేజ్ సర్వీస్ ఇనాం భూములకు సంబంధించి సంబంధిత రెవెన్యూ రికార్డులు, అమలులో ఉన్న ఉత్తర్వులను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆర్డీవో సూచించారు. ఇనాం రద్దు అనంతరం పట్టా హక్కులు చట్టబద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు సంక్రమించిన భూములలో వెబ్‌ల్యాండ్ అడంగల్--2లోని కాలమ్‌లో భూమి స్వభావాన్ని ప్రైవేట్ భూమి"గా నమోదు లేదా సవరించాలి అని స్పష్టం చేశారు.రీ-సర్వే సందర్భంగా భూమి హక్కులు, వర్గీకరణ, సంబంధిత రికార్డుల మధ్య ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన సవరణలు చేపట్టాలని అధికారులకు సూచించారు.ఫేజ్--4, ఫేజ్--5 గ్రామాల్లో రీ-సర్వేకు సంబంధించిన నమోదులు, లాగిన్ ప్రక్రియలు, రికార్డుల పరిశీలన తదితర అంశాలను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని ఆర్డీవో ఆర్. శివ రాముడు ఆదేశించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లుగా సాహిల, డిప్యూటీ తహసీల్దార్, ఛాయాదేవి, తహసిల్దార్ లు, సర్వే డిప్యూటీ తహశీల్దార్లు, వి ఆర్ వో లు, రెవెన్యూ, సర్వే శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెంటపల్లిలో "పోషణ మాహా" కార్యక్రమం

- బాలింతలు, గర్భిణీలకు పోషకాహారంపై అవగాహన






**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 11:-**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "పోషణ మాహా" కార్యక్రమం కోరుకొండ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గోకవరం మండలం పెంటపల్లి గ్రామంలో ఘనంగా జరిగింది.గ్రామ సచివాలయం, అంగన్వాడీ కేంద్రం, డ్వాక్రా మహిళా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చంటి పిల్లల తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తంటికొండ సెక్టార్ సూపర్వైజర్ పెనుగొండ ఇందిరా రాణి ముఖ్య అతిథిగా జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఎన్ నాగమణి, జె సుబ్బలక్ష్మి, టి బుజ్జమ్మ, కే కృష్ణవేణి, బి మైధిలి, జి అమ్మాణి ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ అంగన్వాడి కార్యకర్త ఎమ్ వి వి ఎస్ భాస్కరం, జి రత్నం ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇందిరా రాణి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు బాలింతలు, గర్భిణీలకు ఇవ్వాల్సిన పౌష్టికాహారం - ఆకుకూరలు, పప్పులు,గుడ్లు,పాలు,పండ్లు,మిల్లెట్స్ చిరుధాన్యాలు ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించి గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలింతలు పాటించాల్సిన పరిశుభ్రత, చంటి పిల్లలకు మొదటి 1000 రోజులు బంగారు రోజులు అని ఇందిరా రాణి అన్నారు, ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న బాలామృతం,టేక్ హోమ్ రేషన్,గోరు ముద్ద పలు పథకాల గురించి సూపర్వైజర్ వివరించి చెప్పారు.తంటికొండ సెక్టార్ సూపర్వైజర్ ఇందిరా రాణి ఏ ఎన్ ఎం నాగలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు ఎన్ నాగమణి జె సుబ్బలక్ష్మి టి బుజ్జమ్మ కే కృష్ణవేణి బి మైధిలి జి అమ్మాణి లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ అంగన్వాడి కార్యకర్త ఎమ్ వి వి ఎస్ భాస్కరం, జి రత్నం తదితర సుమారు 30 మంది వరకు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్న ఈ సమావేశానికి డ్వాక్రా మహిళలు తల్లులు కమిటీ సభ్యులు ఆశా వర్కర్లు, డ్వాక్రా వివోలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై అత్యాచారం కేసుపై దర్యాప్తు చేపట్టిన అడిషనల్ ఎస్పీ.





**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 11:-** గురువారం గోకవరం మండలంలో ఒక మహిళపై దాడి అత్యాచారం చేసి పరారైన సంఘటనపై జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మినిస్ట్రేటివ్ పాటిల్ దేవరాజ్ మనీష్ ఐ పి ఎస్ స్పందించారు. శుక్రవారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకుని క్షుణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. నార్త్ జోన్ డి ఎస్ పి జీవన, రాజానగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరయ్య గౌడ్, కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ మూర్తి తదితరులు అడిషనల్ ఎస్పీ కూడా ఉన్నారు.ఇలా ఉండగా గోకవరం మండలం బావాజీపేట గ్రామానికి చెందిన భవాని అనే మహిళ తన మేకలను మేపుకొనటానికి పక్కనే ఉన్న పోలవరం కాలవగట్టుకు వెళ్ళగా సాయంత్రం సమయంలో ఒక అపరిచిత వ్యక్తి అక్కడకు వచ్చి లారీ క్లీనర్ గా పరిచయం చేసుకుని అస్సాగో ఫ్యాక్టరీ కి దారి అడిగినట్లు తను చూపించగా కొంత దూరం వెళ్లి వెనక్కి వచ్చి మహిళపై అత్యాచారానికి ప్రయత్నించడంతో ఆ మహిళ ప్రతిఘటించడంతో ఆ మహిళ చేతిలో ఉన్న మేకలు మేపడానికి ఉపయోగించే ఇనపరాడ్డు తీసుకుని తలపై కొట్టగా బలమైన గాయమై స్పృహ తప్పి పడిపోయిన మహిళపై అత్యాచారం చేసి పరారైనట్లు తెలుస్తుంది.బాధిత మహిళా కోలుకుని తన మేనమామ ఇంటికి వెళ్లి విషయం చెప్పగా మేనమామ కుమారుడు గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ప్రధమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై బాధితరాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం తో జిల్లా అడిషనల్ ఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ స్వయంగా దర్యాప్తులో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పరారీలో ఉన్న నిదితుడిని కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. ఈ కెస్ పై వివరణ కోరేందుకు పెన్ పవర్ ప్రతినిధి కోరుకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ మూర్తి ని వివరణ కోరేందుకు ప్రయత్నించిన ఆయన ఫోన్ తీయలేదు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## రంప ఎర్రంపాలెంలో ఏఎన్ఎం ఆధ్వర్యంలో
# “ఫ్రైడే ఈజ్ డ్రై డే” అవగాహన



**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 11:-** మండలం లోని రంప ఎర్రంపాలెం గ్రామంలో ఏ ఎన్ ఎం సంధ్యారాణి ఆధ్వర్యంలో ఇంటింటికి డ్రై డే పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జి కొత్తపల్లి పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ తీరన్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే లో భాగంగా ఇళ్లలోని నీరు నిల్వ ఉంచే డ్రమ్ములు, కూలర్లు, పూల కుండీలలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేయాలని, దోమల వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తం గా ఉండాలని ఏ ఎన్ ఎం, సంధ్యారాణి కోరారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అక్కడక్కడ మురుగునీరు నిల్వలు డబ్బాలలో ఉండడానికి గుర్తించిన సిబ్బంది తక్షణం వాటిని తొలగించి నిరంతరం ఎప్పటి నీరు అప్పుడే పట్టుకోవాలని ఆహారం పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని వేడివేడి ఆహారం ఆకుకూరలలో తినాలని ఎవరికైనా ఏదైనా జ్వరం వచ్చినా దగ్గు వచ్చినా వాంతులు వచ్చిన విరోచనాలు అయినా ఆలస్యం చేయకుండా మాకు తెలియపరచాలని ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎం పి హెచ్ డబ్ల్యు మెల్ గంగ్రెడ్డి వెంకట రమణ, ఆశా కార్యకర్తలు ద్వారా అచ్చియమ్మ, కురువేళ్ల దుర్గ, వరసాల వెంకటలక్ష్మి, తాటిపాక విమల తదితరులు ఇంటింటికి తిరిగి మహిళలకు అవగాహన కల్పించారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థిని గర్భం?

అడ్డతీగల ,పెన్ పవర్, సెప్టెంబర్ 11; అడ్డతీగల ఆశ్రమ పాఠశాలలో గిరిజన మైనర్ బాలిక గర్భం దాల్చినట్లు సమాచారం. అయితే ఆ మైనర్ గిరిజన బాలిక కుటుంబీకులు గురువారం స్థానిక సిడిపిఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆశ్రమ పాఠశాలకు చెందిన సిబ్బందిలో ఒక వ్యక్తి ఈ దుస్సంఘటనకు కారణమని ఫిర్యాదులో బాధితురాలు కుటుంబీకులు పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అధికారులు స్పందించి ఆ మైనర్ బాలికకు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం రంపచోడవరం ఓ ఎస్ డి జావిలి నేతృత్వంలో సంఘటన స్థలంలో విచారణ చేపట్టారు. అయితే ఈ సంఘటనను అధికారులు ధ్రువీకరించవలసి ఉంది. తల్లిదండ్రులు లేని ఆ మైనర్ బాలిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నట్లు సమాచారం. ఈ సంఘటనకు కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు ధృవీకరించవలసి ఉంది.

## ఎంపీటీసీ, జెడ్పిటిసి ఓటరు జాబితా విడుదల...



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 11;** అడ్డతీగల మండలంలో 30799 మంది తో కూడిన ఓటర్లు జాబితాను శుక్రవారం అడ్డతీగల మండల పరిషత్ కార్యాలయంలో అడ్డతీగల ఎంపీడీవో కుమార్ విడుదల చేశారు . ఈ ఓటరు జాబితాఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికల ఓటర్ల జాబితా అని ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. పోలింగ్ కేంద్రాలు గుర్తించి ఈనెల 15న ముసాయిదా జాబితాను ప్రకటించడం జరుగుతుందని ఎంపీడీవో కుమార్ తెలిపారు.

## వినాయక చవితి మండపాలకు ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి



**చింతూరు పెన్ పవర్, సెప్టెంబర్ 11:** వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు ప్రభుత్వ సింగిల్ విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అనుమతులు పొందాలని చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు. మండపాల ఏర్పాటుకు ముందు సంబంధిత నిబంధనలను పాటిస్తూ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద లౌడ్‌స్పీకర్లను ఏర్పాటు చేసినప్పటికీ అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా, అర్ధరాత్రి వరకు సౌండ్ పొల్యూషన్ చేయరాదని సూచించారు. వినాయక విగ్రహ నిమజ్జనం తేదీ, ప్రదేశం తదితర వివరాలను అనుమతి దరఖాస్తులో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలిగే విధంగా రహదారులకు అడ్డంగా మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. ప్రతి మండపం వద్ద కమిటీ సభ్యులు లేదా వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, సాధ్యమైనంత వరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ఎవరూ మద్యం సేవించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించరాదని సీఐ గోపాలకృష్ణ స్పష్టం చేశారు. వినాయక చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసుల తరఫున అవసరమైన సహకారం అందిస్తామని సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

# తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్, వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి.





మండప నిర్వాహకులతో తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు

**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. సెప్టెంబర్ 11.**తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 14.09.2026న జరగనున్న వినాయక చవితి ఉత్సవాలు మరియు నిమజ్జన ఊరేగింపులు శాంతియుతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలనే ఉద్దేశంతో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం తాడేపల్లిగూడెం పోలీస్ స్టేషన్ నందు తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, తాడేపల్లిగూడెం రూరల్ ఎస్.ఐ. రవికుమార్ స్టేషన్ పరిధిలోని వినాయక మండప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సుమారు 100 మంది మండప నిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, వినాయక చవితి పండుగను అన్ని వర్గాల ప్రజలు కుల, మత సామరస్యంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ఏ చిన్న అంశం కూడా శాంతిభద్రతల సమస్యగా మారకుండా నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. మండప నిర్వాహకులకు ఈ క్రింది సూచనలు చేశారు:

1. ప్రతి మండపానికి అనుమతి/ ఎంఓసి తప్పనిసరిగా పొందాలి. ఆమోదించిన అనుమతి పత్రాన్ని మండపంలో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి.
2. ఊరేగింపులు పోలీసులు ఆమోదించిన మార్గంలో, నిర్ణీత సమయంలో మాత్రమే నిర్వహించాలి. మార్గం మార్చడం గానీ, మధ్యలో అనవసరంగా నిలిపివేయడం గానీ చేయరాదు.
3. కుల, మత పరంగా రెచ్చగొట్టే ఫ్లెక్సీలు, బ్యానర్లు, పాటలు, నినాదాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. ఏదైనా ఫ్లెక్సీ చినిగినా లేదా తొలగించబడినా దానిని ఎవరికీ ఆపాదించకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
4. లౌడ్ స్పీకర్లు/డైజ్ లకు ముందస్తు అనుమతి తప్పనిసరి. రాత్రి 10.00 గంటల నుండి ఉదయం 6.00 గంటల వరకు వాటి వినియోగం నిషిద్ధం. నిర్దేశిత శబ్ద పరిమితులు పాటిస్తూ, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మతపరమైన ప్రదేశాల వద్ద ప్రత్యేక శ్రద్ధ వహించాలి.
5. విద్యుత్ శాఖ నుండి అధికారిక తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ మాత్రమే తీసుకోవాలి. అక్రమ కనెక్షన్/ట్యాపింగ్ చేయరాదు. వైరింగ్, ఎర్తింగ్ లను సరిచూసుకోవాలి.
6. ప్రతి మండపంలో పనిచేసే ఫైర్ ఎక్స్‌తుంగిషేర్ ఉంచాలి. ప్రధాన మండపంలో వంట చేయరాదు, మండపం వద్ద బాణసంచా కాల్చరాదు. అత్యవసర వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించరాదు.
7. రాత్రి సమయంలో మండపం వద్ద కనీసం ఒక బాధ్యత గల వాలంటీర్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి.
8. అధికారికంగా అనుమతించిన నిమజ్జన ప్రదేశాలలో మాత్రమే నిమజ్జనం చేయాలి. పిల్లలను, ఈత రాని వారిని నీటిలోకి పంపరాదు.
9. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, పుకార్లు, రెచ్చగొట్టే పోస్టులను షేర్ చేయరాదు. అలాంటివి గమనిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలి.

మండప నిర్వాహకులతో నిరంతర సమన్వయం కోసం ప్రత్యేక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసినట్లు, పోలీసుల సూచనలు మరియు జాగ్రత్తలు ఆ గ్రూప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేస్తామని ఎస్.ఐ. గారు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా ఎంతటి వారిపైనైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏదైనా అత్యవసర పరిస్థితిలో డయల్ 112 కు గానీ, తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్‌కు గానీ వెంటనే సమాచారం అందించాలని కోరుతూ, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తాడేపల్లిగూడెం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తెలియజేశారు.

# 45వ డివిజన్‌లో రూ.44 లక్షలతో పార్కుల అభివృద్ధి పనులకు శ్రీకారం

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:** స్థానిక 45వ డివిజన్‌లో రూ.44 లక్షలతో రెండు పార్కుల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఆర్అండ్‌బీ వాంబే కాలనీ వద్ద రూ.26 లక్షలతో, పేపర్ మిల్లు కాలనీ వద్ద రూ.18 లక్షలతో పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. అనంతరం డివిజన్ ఇంచార్జ్, కోటిలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కొయ్యల రమణ సారథ్యంలో డివిజన్‌లోని వైకాపాకు చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 45వ డివిజన్ ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న కంపోస్ట్ యార్డు సమస్యకు మరో ఎనిమిది నెలల్లో శాశ్వత పరిష్కారం చూపిస్తామని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో డివిజన్‌లో సుమారు రూ.1.60 కోట్ల అభివృద్ధి పనులు పూర్తి చేయగా, మరో రూ.90 లక్షల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తాజాగా రూ.44 లక్షలతో రెండు పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, వాకింగ్ ట్రాక్‌లు, లైటింగ్, జిమ్ పరికరాలు, పిల్లలకు ఆట స్థలాలు వంటి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. శ్రీలంక ప్రాంతానికి రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తున్నామని, అక్కడి ప్రజలకు పట్టాలు అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. 45వ డివిజన్ ప్రజలను దశాబ్దాలుగా వేధిస్తున్న కంపోస్ట్ యార్డు సమస్యకు కూటమి ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపుతోం దన్నారు. మరో ఎనిమిది నెలల్లో నగర చెత్తను కంపోస్ట్ యార్డుకు తరలించే పరిస్థితి ఉండదని, చెత్తను నేరుగా వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయంగా నిర్వహించే విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు. పార్కులు, రోడ్లు, డ్రైనేజీలు, నీటి సరఫరా వంటి మౌలిక వసతుల అభివృద్ధితో పార్కులను కూడా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. డివిజన్‌లో నీటి సమస్యకు సుమారు రూ.100 కోట్లతో శాశ్వత పరిష్కారం చూపించే కార్యాచరణ కూడా కొనసాగు తోందన్నారు.



# నాన్, ట్రైబల్స్ ఏజెన్సీ వీడాలి



### ఆదివాసీల భూములను గిరిజనేతరులకు విక్రయించొద్దు
### కుంజా శ్రీను

**చింతూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 11:** పోలవరం ప్రాజెక్టు ముంపు పరిహారంలో భాగంగా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పరిహారం పొందిన గిరిజనేతరులు ఏజెన్సీ ప్రాంతాలను వీడి పునరావాస ప్రాంతాలకు తరలివెళ్లాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. చింతూరులో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. చింతూరు ఏజెన్సీ పరిధిలో 500 మందికి పైగా నాన్ ట్రైబల్స్ ఓటీఎస్ ద్వారా పరిహారం పొందినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పరిహారం పొందిన అనంతరం కూడా ఏజెన్సీ ప్రాంతాల్లోనే స్థిర నివాసాలు, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకోవడం నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. పరిహారం సొమ్ముతో కొంతమంది గిరిజనేతరులు ఆదివాసీలను మభ్యపెట్టి ఏజెన్సీలో భూములు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. బినామీ పేర్లతో భూముల కొనుగోళ్లకు పాల్పడుతున్న మధ్యవర్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీలు తమ భూములను గిరిజనేతరులకు విక్రయించవద్దని, భూముల పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కుంజా శ్రీను పిలుపునిచ్చారు. 1/70 చట్టం, ఐదో షెడ్యూల్ ప్రాంతాల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటీఎస్ పరిహారం పొందిన నాన్ ట్రైబల్స్ ఏజెన్సీ ప్రాంతాల్లో కొనసాగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అక్రమ భూముల కొనుగోళ్లపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో పోలవరం జిల్లా అధ్యక్షుడు కూర చిట్టిబాబు, నాయకులు వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ పోలీసులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు శిక్ష

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 11:**శ్రీ రూరల్ మండలం వెంకటనగరం, గ్రామంలో గుమ్మడి సతీష్, (38 ), 2021 ఏప్రిల్ 22న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నార్త్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ ఐ గేడ్డం రాజశేఖర్ తన సిబ్బందితో కలిసి వెంకటనగరంలోని ముద్దాయి ఇంటి వద్దకు తనిఖీ నిమిత్తం వెళ్లారు. అక్కడ ముద్దాయి భార్య గుమ్మడి శారద 10 లీటర్ల నాటుసారాతో పోలీసులను చూసి పారిపోతుండగా ఎక్సైజ్ సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

ముద్దాయి గుమ్మడి సతీష్ కర్ర ఖాళీ బీర్ బాటిల్‌తో ఎక్సైజ్ సిబ్బందిపై దాడికి యత్నిస్తూ, వారిని దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. అనంతరం ముద్దాయి అతని భార్య అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై ఎక్సైజ్ ఎస్సై ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి 3 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై వై.వి. రామ్మోహన్ రావు 353 ఐ పి సి కింద కేసు నమోదు చేసి, సమగ్ర దర్యాప్తు అనంతరం గౌరవ న్యాయస్థానంలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం జరిగింది.

విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరపున 5వ కోర్టు అసిస్టెంట్ సి.హెచ్ . రాజశేఖర్ ప్రాసిక్యూషన్ తరుపున బలమైన వాదనలు వినిపింగా సాక్ష్యాధా రాలను పరిశీలించిన అనంతరం మేజిస్ట్రేట్ సి. జానకి ముద్దాయిపై నేరం రుజువైనట్లు నిర్ధారించి, శిక్ష విధించారు.2 సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన 5వ ఏ జె ఎఫ్ సి ఎం కోర్టు అసిస్టెంట్. ఏ పి పి సి.హెచ్. రాజశేఖర్ ని కేసు ట్రయల్ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన ప్రస్తుత 3 టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. అప్పారావు ని కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఎన్ . వెంకటేశ్వరరావు ని జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్, అభినందించారు.

# డుమ్మాకొట్టిన ఐఏఎస్ అధికారులు...
# సీఎం చంద్రబాబుకు షాక్!



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజధాని అమరావతిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశానికి 28 జిల్లాల కలెక్టర్లతోపాటు సెక్రటరీలు, నూణలు హాజరు కావాల్సివుంది. అయితే కొందరు ఐఏఎస్ అధికారులు ముందస్తు సమాచారం లేకుండా సమావేశానికి గైర్హాజరు కావడాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు గమనించారు. తన ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుంటే ఐఏఎస్ అధికారులు ఎలాంటి అనుమతి లేకుండా డుమ్మా కొట్టడంపై సీరియస్ అయ్యారు. ఏం తమాషానా? అంటూ గైర్హాజరు అయిన అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని సీఎస్ సాయిప్రసాద్ ను ఆదేశించారు.దముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సుకు కొందరు సీనియర్ అధికారులు గైర్హాజరు కావడం చర్చనీయాంశం అయింది. శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తున్న సమయంలో కొందరు అధికారులు లేకపోవడాన్ని సీఎం గమనించారు. ఒకరిద్దరు ఇతర పనులతో రాలేకపోయినట్లు సీఎస్ వివరించారు. అదేసమయంలో సమాచారం ఇవ్వకుండా ఉండిపోయిన అధికారుల విషయంలో మౌనం వహించారు. దీంతో సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన సమావేశానికి బాధ్యత గల అధికారులు రాకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. వాట్సాప్ మెసేజులపై చూపిస్తున్న శ్రద్ధ ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో చూపడం లేదని సీఎం మండిపడ్డారు. కలెక్టర్ల సమావేశానికి ఫోన్లు లేకుండా రావాలని తాను ముందే చెప్పానని సీఎం వ్యాఖ్యానించారు. అయినప్పటికీ చాలా మంది అధికారులు ఫోన్లు తీసుకుని రావడం, సమావేశ మందిరం బయట తమ సిబ్బందికి అప్పగించి మాటమాటకి వాట్సాప్ మెసేజులను చూసుకోవడానికి బయటకు వెళుతుండటం సీఎం ఆగ్రహానికి కారణమైందని అంటున్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై తాను ఎంతో ఓపికగా సమావేశం కొనసాగిస్తుంటే, కలెక్టర్లు కనీసం 12 గంటలు కదలకుండా కూర్చోలేకపోతున్నారని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

కాగా, కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేయడంపై విస్తృత చర్చ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి కలెక్టర్ల సదస్సు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలకు సీఎంతోపాటు మంత్రులు, ఆయా శాఖల విభాగాధిపతులు, కలెక్టర్లు హాజరు అవుతారు. అయితే గతంలో లేనట్లు ఈ సారి సమావేశాలకు ఫోన్లు తేవొద్దని సీఎం ముందే ఆదేశించారు. అయినప్పటికీ అధికారిక విధులలో బిజీగా ఉండే అధికారులు తమతో ఫోన్లు తీసుకురావడం తప్పనిసరిగా మారిందని అంటున్నారు.

అర్జంటు సమాచారం, ఇతర అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు అన్నీ ఫోన్లలో జరుగుతున్న సమయంలో ఫోన్ లేకుండా ఎలా? అని కొందరు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫోన్లు వెంట ఉండటం వల్ల అధికారులు తాను చెప్పే అంశాలపై శ్రద్ధ వహించలేకపోతున్నారని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు. ఇక సమావేశానికి ఫోన్లు తీసుకురావడం, ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో ఎక్కువ సమయం తీసుకోవడంపై సీఎం అసంతృప్తికి లోనరయ్యారని అంటున్నారు. దీంతో సమావేశంలోనే అందరినీ హెచ్చరిస్తూ డుమ్మా కొట్టిన వారి పేర్లు చదివి హెచ్చరికలు పంపారని అంటున్నారు. ఇక మంత్రులు కూడా ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని మందలించారు.

# చిన్న శ్రీను చేరిక.. టీడీపీలో వారికి ఇష్టం లేదు!!

**హైదరాబాద్ పెన్ పవర్:** విజయనగరం జిల్లా పరిషత్ చైర్మను, వైసీపీ కీలక నేత బొత్స మేనల్లుడు చిన్న శ్రీను టీడీపీలో చేరడం ఆ పార్టీలో విస్తృత చర్చకు దారితీస్తోంది. చిన్న శ్రీనుతో ఇప్పటివరకు యుద్ధం చేసిన వారిలో ఎక్కువ మంది ఆయన పార్టీలో రాకను జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. అలా అని అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించలేక తీవ్ర అంతర్మథనానికి లోనవుతున్నారని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా జడ్పీ చైర్మనుగా సర్వం తానై రాజకీయం నడిపిన చిన్నశ్రీనుతో టీడీపీకి చెందిన అనేక మంది నాయకులు నువ్వా-నేనా అన్నట్లు తలపడ్డామని, పరస్పర విమర్శలతో గత ఎన్నికల్లో చిన్నశ్రీనును నైతికంగా ఓడించామని చెబుతున్నారు. అలాంటి వ్యక్తిని ఇప్పుడు తమ పక్కన కూర్చోబెట్టుకుని ఎలా సమర్థించాలో అర్థం కావడం లేదని పలువురు టీడీపీ సీనియర్లు వ్యాఖ్యానిస్తున్నారు.రెండు రోజుల క్రితం వైసీపీకి రాజీనామా ప్రకటించిన జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీను ఆ వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో ప్రత్యక్షమై అందరికీ షాక్ ఇచ్చారని అంటున్నారు. తాను వైసీపీని వీడుతానని కానీ, టీడీపీలో చేరతానని కానీ ఏ ఒక్కరికి ముందుగా చెప్పని చిన్న శ్రీను అత్యంత రహస్యంగా వ్యవహరించి ఆఖరి నిమిషంలో తన వ్యూహాన్ని బయటపెట్టారని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రి నివాసానికి చిన్న శ్రీను చేరుకుంటారని నిర్ధారించుకున్న కాసేపటికే జిల్లాలో ప్రజాప్రతినిధులు, సీనియర్లకు సమాచారం ఇచ్చారని అంటున్నారు. అంతేకాకుండా జిల్లా నేతలు అంతా మంగళగిరిలో నిర్వహిస్తున్న లీడర్ షిప్ సమ్మిట్ లో ఉండటంతో అందరినీ ముఖ్యమంత్రి నివాసానికి రావాల్సిందిగా ఆదేశించారని అంటున్నారు.ఇక సీఎం కార్యాలయ సిబ్బంది సూచనలతో ఉండవల్లిలో చంద్రబాబు నివాసానికి వెళ్లిన తర్వాత అక్కడ చిన్నశ్రీనును చూసిన పార్టీ నేతలు షాక్ కు గురయ్యారని చెబుతున్నారు. అప్పటికి కొద్దిసేపటి క్రితమే ఆయన పార్టీలో చేరతారని సమాచారం ఇచ్చి, ఆ వెంటనే కండువా కప్పేలా జరిగిన ఏర్పాట్లు చూసి టీడీపీ సీనియర్లు ఆశ్చర్యపోయారని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా పార్టీలో చేరికలను ప్రోత్సహించాల్సివున్నప్పటికీ జిల్లా స్థాయి నేత పార్టీలోకి వచ్చేముందు తమకు కనీస సమాచారం ఇవ్వలేదని కొందరు నేతలు అంతర్గత సంభాషణల్లో నొచ్చుకుంటున్నారని ప్రచారం



జరుగుతోంది.విజయనగరం జిల్లాలో టీడీపీ నేతలకు వ్యతిరేకంగా చిన్నశ్రీను సుదీర్ఘంగా రాజకీయం నడిపారు. కాంగ్రెస్, వైసీపీ పార్టీల తరఫున తెరముందు బొత్స, ఆయన సోదరులు, ఇతర కుటుంబ సభ్యులు రాజకీయం చేస్తే వారందరికీ వెన్నుదన్నుగా నిలుస్తూ తెరవెనుక చక్రం తిప్పి, వారి విజయానికి తగిన వ్యూహాలు రచించడం చిన్నశ్రీను చూసేవారని చెబుతున్నారు. అయితే బొత్స కుటుంబ రాజకీయం ఇలా కొనసాగినంత వరకు చిన్నశ్రీనుతో టీడీపీకి పెద్దగా ఇబ్బంది లేదని అంటున్నారు. కానీ, 2021లో ఆయన జడ్పీ చైర్మనుగా తెరముందుకు వచ్చిన తర్వాత రాజకీయం పూర్తిగా మారిపోయిందని అంటున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అనుసరించిన విధానాలనే చిన్న శ్రీను కూడా విజయనగరంలో అమలు చేయడంతో రాజకీయ కక్ష సాధింపులు ఎక్కువగా సాగాయని, తమ కార్యకర్తలు కేసులు ఎదుర్కొన్నారని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారని టీడీపీలోని కొందరు నేతలు ఎత్తిచూపుతున్నారు. అంతేకాకుండా పలువురు టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తలు సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ పోస్టుల ద్వారా తమ నిరసన వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. సామాజిక, రాజకీయ సమీకరణాల పేరుతో ప్రత్యర్థులను పార్టీలోకి తేవడం వల్ల సొంత కేడర్ నష్టపోతుందన్న విషయాన్ని పార్టీ అధిష్టానం ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

కాగా, చిన్నశ్రీను చేరికను టీడీపీలో జిల్లాస్థాయి నేతలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కొందరు నేతలు మాత్రం స్వాగతిస్తున్నారని అంటున్నారు. చిన్నశ్రీనును తీసుకోవడం వల్ల వైసీపీ వెన్నుముక విరిచేసినట్లైందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం జిల్లాలో ఉన్న నేతల్లో దూకుడుగా రాజకీయం చేసే నేతలు తక్కువగా ఉన్నారని, ఉన్న ఒకరిద్దరికి చిన్నశ్రీను జత కలిస్తే భవిష్యత్తులో పార్టీ మరింత బలపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్న వారు సైతం ఎక్కువగానే ఉన్నారంటున్నారు. ఇప్పటివరకు జిల్లాకు పెద్ద దిక్కుగా వ్యవహరించిన అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా వెళ్లిపోవడం, మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ఇప్పటికీ జిల్లాపై పట్టుసాధించలేకపోవడం వల్ల చిన్న శ్రీను రాక కలిసివస్తుందని మరికొందరు సమర్థిస్తున్నారు. మొత్తానికి చిన్న శ్రీను టీడీపీ కండువా కప్పుకోవడంపై ఆ పార్టీలో రెండు రోజులుగా వాడివేడి చర్చలు కొనసాగుతూనే ఉన్నాయని అంటున్నారు.

# కాలుష్య నియంత్రణలో ఢిల్లీ బెస్ట్

**విశాఖపట్టణం, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** రాజధాని ఢిల్లీతో పోటీ పడడమే కాదు బెస్ట్ ర్యాంక్ ని విశాఖపట్నం అందుకుంది. దేశ రాజధానితో సమానంగా విశాఖ పెర్ఫార్మెన్స్ చేయడం ఇక్కడ విశేషం. ఏ విషయంలో అంటే కాలుష్య నియంత్రణలో. పకడ్బందీగా చర్యలు తీసుకుని విశాఖ దేశంలోనే మంచి ర్యాంక్ ని అందుకుంది. అలాగే ఢిల్లీ తో కలసి 21వ ర్యాంక్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకుల్లో ఢిల్లీ విశాఖ 21వ ర్యాంక్ ని కలిసి పంచుకున్నాయి. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026’ ర్యాంకులలో విశాఖ ఈ విధంగా ఇంట్రెస్టింగ్ రిజల్ట్ ని సాధించింది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ 2026 ర్యాంకులలో లక్నోకు అగ్ర స్థానం దక్కింది. ఈ కేటగిరీలో 198 పాయింట్లతో లక్నో నంబర్ వన్ గా నిలిచింది. అలాగే ఇండోర్ రెండో స్థానంలో ఉంటే 195 పాయింట్లతో జబల్‌పూర్ మూడో స్థానంలో ఉంది. ఇక ఢిల్లీ 172 పాయింట్లతో విశాఖపట్నంతో కలిసి 21వ స్థానాన్ని పంచుకుంది. గత ఏడాది ఢిల్లీ 32వ స్థానంలో ఉంది. అయితే ఈసారి ఢిల్లీ తన ర్యాంకును మరింతగా మెరుగుపరుచుకోవడం విశేషంగా పేర్కొంటున్నారు. దేశంలో చూస్తే ఇతర ప్రధాన నగరాలైన హైదరాబాద్ 19వ స్థానంలో ఉంటే పాట్నా 16, ముంబై 28, చెన్నై 35, కోల్‌కతా 38వ స్థానాల్లో నిలిచాయి.ఏమిటీ ర్యాంకులు వీటి వెనక కథ ఏంటి అంటే ఈ ర్యాంకులు అందుకున్న నగరాల్లో కాలుష్యం పూర్తిగా తొలగిపోయింది అని కాదు, అయితే కాలుష్యం విషయంలో ఈ నగరాలు తీసుకుంటున్న కీలక చర్యలు, రోడ్లపై దుమ్ము ధూళీ లేకుండా సక్రమంగా ఉంచడం, పేరుకుపోకుండా ఘన వ్యర్థాల తొలగింపు, వాహనాల ద్వారా పరిశ్రమల ద్వారా వెదజల్లే ఉద్గారాలను వీలైనంత మేరకు తగ్గింపు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణ, కాలుష్యం మీద ప్రజలలో అవగాహన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులను జాతీయ స్థాయిలో ప్రకటిస్తారు. ఈ నగరాలలో గాలి నాణ్యత తక్కువగా ఉండొచ్చు అయితే కాలుష్య నియంత్రణ చర్యలు బలంగా అమలు అవుతున్నందువల్ల ఏదో నాటికి నాణ్యమైన గాలి ఆ నగరాలకు దక్కుతుందని అంటున్నారు. జాతీయ స్వచ్ఛమైన గాలి కార్యక్రమం కింద కేంద్ర ప్రభుత్వం ఈ సర్వేను నిర్వహిస్తోంది నిజానికి ఢిల్లీ అంటేనే కాలుష్యం అని చెబుతారు. శీతాకాలంలో అయితే ఢిల్లీలో ఎవరూ ఉండలేని పరిస్థితి తలెత్తుతుంది. విపరీతంగా వచ్చే పొగమంచు అలాగే విషపూరితమైన గాలి ఉన్నప్పటికీ ఢిల్లీ కాలుష్యాన్ని నియంత్రించేందుకు తీసుకున్న చర్యలు గొప్పగా ఉన్నాయని అంటున్నారు. దీని వల్ల ఢిల్లీ ఏదో నాటికి కాలుష్యం కోరల నుంచి బయట పడుతుంది అని అంటున్నారు. అలా పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల కేటగిరీలో ఢిల్లీ 21వ స్థానంలో నిలిచింది. ఇక విశాఖ విషయం తీసుకుంటే అంతకంతకు ఈ నగరంలోనూ కాలుష్యం పెరిగిపోతోంది. అయితే దానిని నిరోధించేందుకు సరైన సమగ్రమైన చర్యలు చేపడుతూ విశాఖ కూడా దీ బెస్ట్ అనిపించుకుంటోంది. అందుకే మంచి ర్యాంక్ ని పొందింది అని అంటున్నారు.

## వారసుల కోసమే సీనియర్ల ప్రయత్నాలు

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఖాళీ అవుతోందన్న సంకేతాలు రోజురోజుకూ మరింత బలపడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ఘోర పరాభవం తర్వాత ఉనికి కోల్పోతున్న వైఎస్ఆర్‌సీపీలో కొనసాగడం తమ రాజకీయ భవిష్యత్తుకే కాకుండా, తమ వారసుల అరంగేట్రానికి కూడా ముప్పు అని సీనియర్ నేతలు గ్రహించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఈ ఒక్క ఘటన ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వైఎస్ఆర్‌సీపీ అగ్రనేతలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లయింది.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు చెందిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి కీలక నేతలు టీడీపీ, జనసేన అధిష్టానాలతో తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ వలసల వెనుక ఉన్న ప్రధాన రాజకీయ కారణం రాబోయే మహిళా రిజర్వేషన్లు, వారసత్వ రాజకీయం . 2029 నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలుకావడం ఖాయమని తేలడంతో పాటు, ఇటీవల టీడీపీ మహానాడులో మంత్రి నారా లోకేష్ బిల్లు పాస్ కాకపోయినా పార్టీ తరఫున మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని సంచలన ప్రకటన చేశారు. దీంతో తమ కుమార్తెలను లేదా కోడళ్లను రాజకీయ బరిలోకి దించాలనుకుంటున్న సీనియర్ నాయకులకు కూటమి పార్టీలే సురక్షితమైన, ఆశాజనకమైన వేదికలుగా కనిపిస్తున్నాయి.వైఎస్ఆర్‌సీపీ జెండాపై పోటీ చేస్తే భవిష్యత్తులో గెలిచే అవకాశాలు శూన్యమని, తమ వారసుల రాజకీయ జీవితాలు ప్రారంభంలోనే దెబ్బతింటాయని ఈ సీనియర్లు భావిస్తున్నారు. అందుకే, చిన్న శ్రీను తన కుమార్తెను జెడ్పీ చైర్‌పర్సన్‌గా నిలబెట్టే ముందస్తు వ్యూహంతో టీడీపీ పసుపు కండువా కప్పుకున్నట్లే.. మిగిలిన ముగ్గురు ఉమ్మడి జిల్లాల నేతలు కూడా తమ మహిళా వారసులను స్థానిక సంస్థలు, రాబోయే అసెంబ్లీ స్థానాలకు స్థిరపరచేందుకు కూటమి నేతలతో రాయబారాలు నెరుపుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం వైపు నుంచి కూడా ఈ వలసలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఏకపక్ష విజయాలు సాధించి, ప్రతిపక్షాన్ని క్షేత్రస్థాయి నుంచి పూర్తిగా తుడిచిపెట్టాలనేది కూటమి వ్యూహం. బలమైన ఓటు బ్యాంక్, సామాజిక వర్గ సమీకరణాలు ఉన్న వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల వారసులను చేర్చుకోవడం ద్వారా తమ గెలుపు అవకాశాలను మరింత సుగమం చేసుకోవచ్చని టీడీపీ-జనసేన వర్గాలు లెక్కిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ ఒక రకమైన శూన్యతలోకి జారుకుంటోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరి, పార్టీ పునర్నిర్మాణంలో కొరవడిన దిశానిర్దేశం వల్ల విసిగిపోయిన నేతలు.. తమ వారసుల భవిష్యత్తును కాపాడుకునేందుకు పవర్ అండ్ ఫ్యూచర్ ఉన్న కూటమి వైపే మొగ్గు చూపుతున్నారు. రాబోయే స్థానిక పోరు నాటికి ఉత్తరాంధ్ర వైఎస్ఆర్‌సీపీ నుంచి మరిన్ని వికెట్లు పడటం, వారసుల రాజకీయ రంగానికి కూటమి వేదికగా మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

## వైసీపీకి జీవన్మరణ సమస్య

**విజయవాడ, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగే సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ తీవ్రమైన ఒత్తిడికి, కంగారుకు గురవుతున్నట్లు స్పష్టమవుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాభవం నుంచి కోలుకోకముందే ఎదురవుతున్న స్థానిక పోరులో ఉనికి కాపాడుకోవడం ఆ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారింది. ఈ క్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకత్వం శాంతియుత ప్రజాస్వామ్య పోరాటాలను ఎంచుకోవడానికి బదులుగా, రక్తాభిషేకాలు, నరుకుతాం, చంపుతాం వంటి తీవ్రమైన ఆవేశపూరిత వ్యాఖ్యలతో క్యాడర్‌ను రగల్చే ప్రయత్నం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో పాటు ఆ పార్టీ ముఖ్య నేతలు వీధి పోరాటాల పేరిట ఇస్తున్న పిలుపులు, వాడుతున్న భాష క్షేత్రస్థాయి శ్రేణులను మరింత ఇరకాటంలో పడేస్తున్నాయి. గత ఐదేళ్ల పాలనలో నమోదైన అక్రమ కేసులు, అధికార మార్పిడి తర్వాత చోటుచేసుకున్న చట్టపరమైన పరిణామాలతో ఇప్పటికే వందలాది మంది వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటువంటి సున్నితమైన సమయంలో తిరగబడండి, తెగబడండి అంటూ నాయకత్వం ఇచ్చే ఆవేశపూరిత ఉపన్యాసాలు క్యాడర్‌ను శాంతింపజేయడానికి బదులు, మరిన్ని కొత్త కేసుల్లోకి నెట్టివేసే ప్రమాదం ఉంది.ఈ తరహా ఆవేశపూరిత రాజకీయం వెనుక వైఎస్ఆర్‌సీపీ తీవ్రమైన కంగారు, అభద్రతా భావం దాగి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై వేగంగా అడుగులు వేస్తుండటంతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు లేదా ఏకపక్ష విజయాలు సాధిస్తే వైసీపీ క్యాడర్ పూర్తిగా ఖాళీ అయిపోతుందనే భయం ఆ పార్టీని వెంటాడుతోంది. ప్రజాదరణతో ఎన్నికలను ఎదుర్కోవడానికి తగినంత గ్రౌండ్ వర్క్ లేకపోవడంతో, ఘర్షణ పూరిత వాతావరణాన్ని లేదా సెంటిమెంట్‌ను రగల్చడం ద్వారా ఎన్నికలను వాయిదా వేయించడమో, లేదా వైలెంట్ నేరేటివ్‌తో ఉద్రిక్తతలు సృష్టించి ప్రభుత్వంపై వేధింపుల ముద్ర వేయడమో ఒకే ఒక్క మార్గంగా వైసీపీ ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఈ తీవ్రమైన వ్యాఖ్యలు పార్టీకి మైలేజ్ ఇవ్వడం కంటే తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. కేసుల్లో ఇరుక్కుని జైలుపాలు లేదా కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తే, తమను ఆదుకోవడానికి ఏ సీనియర్ నాయకుడూ ముందుకు రాడనే నిజం ఇప్పటికే వైఎస్ఆర్‌సీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వానికి అర్థమైంది. నాయకులు మైకుల ముందు ఆవేశంగా మాట్లాడి వెళ్ళిపోతారు, కానీ చట్టపరమైన పరిణామాలు అనుభవించాల్సింది క్షేత్రస్థాయి కార్యకర్తలే. దాంతో నాయకత్వం ఎంత రగిల్చినా, క్యాడర్ మాత్రం మళ్లీ కేసులు కొనితెచ్చుకోవడానికి సిద్ధంగా లేదు. అంతిమంగా, హింస లేదా రెచ్చగొట్టే రాజకీయాలను నమ్ముకోవడం ద్వారా ఏ పార్టీ కూడా సుదీర్ఘకాలం నిలబడలేదు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడితే దానికి చట్టపరంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎదురుతిరగాలి తప్ప.. నరకడం, చంపడం వంటి పదజాలంతో రాజకీయం చేస్తే పార్టీ మరింత బలహీనపడటంతో పాటు సామాన్య ప్రజల్లో మరింత వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుంది. స్థానిక పోరు వేళ వైఎస్ఆర్‌సీపీ అనుసరిస్తున్న ఈ ఆవేశపూరిత వ్యూహం పార్టీని పునరుద్ధరించడానికి బదులు, ఉన్న క్యాడర్‌ను కూడా దూరం చేసే ప్రమాదంలో పడేస్తోంది

## కాంగ్రెస్ కు దగ్గరవుతున్న జగన్



**కడప, సెప్టెంబర్ 11, పెన్ పవర్:** వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రమంగా కాంగ్రెస్ అధిష్టానానికి దగ్గరవుతున్నారనే ప్రచారం ఢిల్లీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వైఎస్ జగన్ సుదీర్ఘంగా చర్చలు జరిపారన్న కథనాలు రావడం, ఈ భేటీ వార్తలను అటు కాంగ్రెస్ కానీ, ఇటు వైఎస్ఆర్‌సీపీ కానీ స్పష్టంగా ఖండించకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. కేంద్రంలోని అధికార పక్షానికి అనుకూలంగా ఉంటూ వస్తున్న జగన్, సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత తన జాతీయ రాజకీయ వ్యూహాన్ని పూర్తిగా మార్చుకుంటున్నారనే సంకేతాలు వెలువడుతున్నాయి.ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తూ.. కాంగ్రెస్ అనుకూల సెఫాలజిస్టులు , విశ్లేషకులు జగన్-కాంగ్రెస్ కలయిక పై కొత్త లాజిక్కులు తెరపైకి తెస్తున్నారు. గత ఎన్నికల్లో ఏపీలో కాంగ్రెస్ పార్టీకి గణనీయమైన ఓటు బ్యాంక్ రాకపోయినా, ఓట్ల చీలిక వైఎస్ఆర్‌సీపీ విజయావకాశాలను కొంతవరకు దెబ్బతీసిందనే అంచనా ఉంది. భవిష్యత్తులో వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్ ఒకే గొడుగు కిందకి వచ్చినా లేదా ఇండియా కూటమి భాగస్వామిగా వైసీపీ చేరినా.. ఏపీలో కూటమికి గట్టి పోటీ ఇవ్వవచ్చని, కేంద్రంలోనూ బీజేపీకి వ్యతిరేక పక్షంలోకి మారేందుకు జగన్‌కు రోడ్‌మ్యాప్ సిద్ధమవుతోందని విశ్లేషిస్తున్నారు.అయితే, ఈ రాజకీయ పునరేకీకరణ వెనుక అతిపెద్ద అడ్డంకి వైఎస్ షర్మిల పాత్ర. ప్రస్తుతం ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న షర్మిల.. వైఎస్ జగన్‌పై, ఆయన పాలనా శైలిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఆస్తి వివాదాలు, కుటుంబ విభేదాలు ఉన్నాయి. సయోధ్య కుదిరితే తప్ప కాంగ్రెస్-వైసీపీ మైత్రి సాధ్యం కాదనే వాదన ఒకవైపు ఉంది. కానీ, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరు అన్నట్లుగా.. హైకమాండ్ ఆదేశిస్తే ఢిల్లీ పెద్దల సమక్షంలో కుటుంబ కలహాలను పక్కనబెట్టి ఒక అవగాహనకు వచ్చే అవకాశాలను కూడా కొట్టిపారేయలేము.వైఎస్ జగన్ ఈ దిశగా అడుగులు వేయడానికి మరో బలమైన కారణం --- కేంద్రంలోని అధికార పక్షం నుంచి గతంలో లభించినంత పొలిటికల్ రక్షణ ఇప్పుడు లభించడం లేదన్న భావన. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నమోదు అవుతున్న కేసులు, ఈడీ, సీబీఐ విచారణల వేగం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో ప్రాంతీయంగా ఒంటరిపోరు చేయడం కంటే, జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో జతకట్టడం ద్వారా వ్యూహాత్మక రాజకీయ రక్షణ దక్కుతుందనే ఆలోచనలో వైసీపీ అధినాయకత్వం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.కేసీ వేణుగోపాల్‌తో నడిచిన ఈ చర్చలు కేవలం ఆరంభం మాత్రమేనా లేక పక్కా ప్రణాళిక ప్రకారం సాగుతున్న పొలిటికల్ మూవా అనేది రాబోయే రోజుల్లో స్పష్టమవుతుంది. ఒకవేళ జగన్ నిజంగానే కాంగ్రెస్‌తో చేతులు కలిపితే, అది ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ మార్పులకు దారితీస్తుంది.

# కౌంటీ క్రికెట్‌లో కుల్దీప్ యాదవ్ మాయ.. ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లతో గంభీర్‌కు గట్టి సందేశం

- ఇంగ్లండ్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన కుల్దీప్
- యార్క్‌షైర్ తరపున ఆడుతూ ఒకే మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన వైనం
- బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచిన స్పిన్నర్
- ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, కోచ్ గంభీర్‌కు గట్టి సందేశం
- భారత, ఇంగ్లండ్ పిచ్‌ల మధ్య ఉన్న తేడాను వివరించిన కుల్దీప్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాలో చోటు కోసం ఎదురుచూస్తున్న స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, ఇంగ్లండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. యార్క్‌షైర్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ చైనామన్ బౌలర్, ఎసెక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 10 వికెట్లు పడగొట్టి తన సత్తా ఏంటో నిరూపించుకున్నాడు. బంతితోనే కాకుండా బ్యాట్‌తోనూ రాణించి, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. నిలకడగా అవకాశాలు దక్కని ప్రస్తుత తరుణంలో ఈ ప్రదర్శన టీమిండియా యాజమాన్యానికి, ముఖ్యంగా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు గట్టి సందేశం పంపినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**ఒకే మ్యాచ్‌లో 10 వికెట్ల ప్రదర్శన**

ఎసెక్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో యార్క్‌షైర్ తరఫున బరిలోకి దిగిన కుల్దీప్ యాదవ్ ఆద్యంతం ఆధిపత్యం చెలాయించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 70 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా, రెండో ఇన్నింగ్స్‌లో మరింత చెలరేగి 50 పరుగులకే 6 వికెట్లు పడగొట్టాడు. దీంతో మ్యాచ్ మొత్తంలో 120 పరుగులకు 10 వికెట్లు సాధించిన ఘనతను అందుకున్నాడు. అంతకుముందు బ్యాటింగ్‌లోనూ కీలకమైన 36 పరుగులు చేసి జట్టు స్కోరు 390కి చేరడంలో తన వంతు పాత్ర పోషించాడు. ఎసెక్స్ తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకే ఆలౌట్ అయింది.

**ఇంగ్లండ్, భారత పిచ్‌ల మధ్య తేడా ఇదే..**

మ్యాచ్ అనంతరం కుల్దీప్ మాట్లాడుతూ ఇంగ్లండ్ పిచ్‌ల స్వభావాన్ని వివరించాడు. “ఇక్కడి వికెట్లపై బౌలింగ్ చేయడం చాలా బాగుంది. పిచ్‌లోనే మంచి పేస్ ఉండటంతో మనం వేగంగా బంతులు వేయాల్సిన అవసరం లేదు. బంతి పిచ్ అయ్యాక వేగం పుంజుకుంటుంది. మనం చేయాల్సిందల్లా బంతిని బాగా స్పిన్ చేయడమే. భారత పిచ్‌లతో పోలిస్తే ఇది పూర్తిగా భిన్నం. మన దగ్గర వికెట్లు నెమ్మదిగా ఉంటాయి, స్పిన్ ఎక్కువ తిరుగుతుంది. కానీ బ్యాటర్లు సర్దుకోవడానికి సమయం దొరుకుతుంది. ఇక్కడ పిచ్ వేగం కారణంగా బ్యాటర్లు బ్యాక్‌ఫుట్‌పై ఆడితే దొరికిపోతారు. ఫ్రంట్‌ఫుట్‌పై ఆడాల్సి వస్తుంది. అప్పుడే కీపర్ క్యాచ్, స్లిప్ క్యాచ్ లేదా షార్ట్ లెగ్ క్యాచ్ రూపంలో వికెట్లు తీసే అవకాశం ఎక్కువగా ఉంటుంది” అని కుల్దీప్ విశ్లేషించాడు.

**గంభీర్‌కు సందేశమా?**

లెఫ్ట్ ఆర్మ్ రిస్ట్ స్పిన్నర్లు (చైనామన్) ప్రపంచ క్రికెట్‌లో చాలా అరుదు. అలాంటి అరుదైన నైపుణ్యం ఉన్నప్పటికీ, 2017లో అరంగేట్రం చేసినప్పటి నుంచి కుల్దీప్ కేవలం 19 టెస్టుల్లో మాత్రమే ఆడాడు. కెరీర్ ఆరంభంలో అశ్విన్, జడేజా ద్వయం కారణంగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు హెడ్ కోచ్‌గా వచ్చిన గౌతమ్ గంభీర్, కాస్త బ్యాటింగ్ చేయగల బౌలర్లకే ప్రాధాన్యత ఇస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

ఈ కారణంగానే వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లకు అవకాశాలు లభిస్తుండగా, కుల్దీప్ జట్టులోకి వస్తూ పోతూ ఉన్నాడు. నిలకడగా అవకాశాలు లేక తన పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేకపోతున్నాడు. ఈ నేపథ్యంలో కౌంటీల్లో 10 వికెట్ల ప్రదర్శనతో తన ప్రధాన బలం బౌలింగే అని, అవకాశాలిస్తే ఎలాంటి పిచ్‌పైనైనా వికెట్లు తీయగలనని కుల్దీప్ యాదవ్ సెలక్టర్లకు, యాజమాన్యానికి స్పష్టమైన సంకేతాలు పంపాడు.

# చెన్నై సూపర్ కింగ్స్ లో వాటా కావాలని ధోనీ అడగలే.. కానీ కోట్లు విలువ చేసే షేర్లు ఉన్నాయ్: అసలు




**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ఎంఎస్ ధోనికి రూపాయి వాటా కూడా లేదంటూ సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ చేసిన వ్యాఖ్యలు అబద్ధమని తేలిపోయింది. రూ.2,033 కోట్ల విలువైన ఈ ఐపీఎల్ ఫ్రాంచైజీలో ధోనికి ఏకంగా కోట్ల విలువైన షేర్లు ఉన్నట్లు వచ్చిన తాజా నివేదిక క్రికెట్ ప్రపంచంలో పెను సంచలనం సృష్టిస్తోంది.

**సీఎస్కేలో ధోని వాటా ఎంతంటే:**

క్రిక్‌బజ్ కథనం ప్రకారం.. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీకి మూలస్తంభంగా ఉన్న మహేంద్ర సింగ్ ధోని సీఎస్కేలో దాదాపు 1 లక్ష షేర్లు కలిగి ఉన్నారు. వీటి ప్రస్తుత మార్కెట్ విలువ రూ.2.6 కోట్ల నుంచి రూ.3 కోట్లుగా ఉంది. కానీ ఫ్రాంచైజీ యాజమాన్యం నుంచి నేరుగా కాకుండా, అన్‌లిస్టెడ్ కంపెనీ అయిన సీఎస్కే షేర్లను ప్రైవేట్ ఆఫ్-మార్కెట్ లావాదేవీల (ాటట-మీుతీఎవ ఎతీుఅయిువ్ఱశీఅం) ద్వారా మహీ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది.

**సీఈఓ ఖండించినా బిగ్ ట్విస్ట్:**

ఎంఎస్ ధోని తమను వాటాల కోసం ఎప్పుడూ సంప్రదించలేదని, శ్రీనివాసన్‌తో కూడా దీనిపై చర్చించలేదని సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ గతంలో క్లారిటీ ఇచ్చారు. ప్రస్తుతం సీఎస్కే ప్రమోటర్ అయిన శ్రీనివాసన్ కుటుంబం దగ్గర 55 శాతానికి పైగా మెజారిటీ వాటా ఉండగా.. సాధారణ ప్రజల వద్ద ఉన్న 40 శాతం వాటా (30 కోట్ల షేర్లు) నుంచే ధోని తెలివిగా 1 లక్ష షేర్లను తన సొంతం చేసుకున్నారు.

**రూ.1200 కోట్ల బిజినెస్ సామ్రాజ్యం:**

దాదాపు రూ.1,200 కోట్ల నికర ఆస్తి కలిగిన మహేంద్ర సింగ్ ధోని కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా పలు ద రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. చెన్నైయిన్ ఎఫ్‌సీ ఫుట్‌బాల్ టీమ్‌తో పాటు గరుడ ఏరోస్పేస్, కార్స్24, హోమ్‌లేన్, ఈమోటోరాడ్ లాంటి 15కి పైగా దిగ్గజ స్టార్టప్‌లలో ధోని వాటాలని కలిగి ఉన్నాడు. ఇప్పుడు సీఎస్కేలోనూ ఓనర్‌షిప్ వాటా బయటపడటంతో తలా ఈజ్ ది రియల్ బాస్ అంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియాను ఊపేస్తున్నారు.

# టీమ్‌మేట్స్‌పై కాఫీ చల్లోద్దు బాస్.. కేఎల్ రాహుల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ స్ట్రిక్ట్ వార్నింగ్!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2027 ట్రేడింగ్ విండో వేళ కేఎల్ రాహుల్ పేరు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ నుంచి రాహుల్ బయటకు వెళ్ళిపోతున్నాడని, కేకేఆర్ (ఖఖ=) జట్టు అతన్ని కొనుగోలు చేయడానికి సిద్ధమైందంటూ జోరుగా ప్రచారం జరుగుతుండగా.. ఢిల్లీ టీమ్ అఫీషియల్ ఇన్స్టాగ్రామ్ పేజీ చేసిన ఒక సంచలన కామెంట్ ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది.

**కోచ్‌పై కాఫీ విసిరి కొట్టాడా:**

ఐపీఎల్ 2026 సీజన్ సమయంలో ఢిల్లీ క్యాపిటల్స్ హెడ్ కోచ్ హేమాంగ్ బదానీకి, కేఎల్ రాహుల్‌కు మధ్య తీవ్ర స్థాయిలో వివాదం నడిచిందని.. కోపంలో రాహుల్ ఏకంగా కోచ్‌పై కాఫీ విసిరి కొట్టాడంటూ నెట్టింట వార్తలు వైరల్ అయ్యాయి. తాజాగా రాహుల్ ప్రశాంతంగా కాఫీ తాగుతున్న ఫోటోను ఇన్స్టాగ్రామ్‌లో షేర్ చేయగా, డీసీ అఫీషియల్ హ్యాండిల్ స్పందిస్తూ.. ఎవరిపైనా కాఫీ చల్లకండి బాస్! (ఖఱంఱ జూవ జూష్ట్రవనఱు ఎఫ్) అంటూ కౌంటర్ ఇచ్చింది. ఈ కామెంట్‌తో వివాదం నిజమేనని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**కేకేఆర్‌కు ట్రేడ్ సస్పెన్స్‌పై క్లారిటీ:**

కాఫీ వివాదం కారణంగా కేఎల్ రాహుల్‌ను కేకేఆర్‌కు ఇచ్చేస్తున్నారనే వార్తలను ఢిల్లీ క్యాపిటల్స్ సహ యజమాని పార్థ్ జిందాల్ పూర్తిగా తోసిపుచ్చారు. రాహుల్ అత్యద్భుతమైన ఆటగాడని, రాబోయే కొన్ని ఐపీఎల్ సీజన్ల వరకు అతడే తమ ఫ్రాంచైజీ కీలక ప్లేయర్‌గా కొనసాగుతాడని స్పష్టం చేశారు. దీంతో రాహుల్ ట్రేడింగ్ ప్రచారానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.

**ఢిల్లీ తరఫున రాహుల్ రికార్డులు:**

2025 సీజన్: మిడిల్ ఆర్డర్‌లో దిగి 53.90 సగటుతో 539 పరుగులు.

2026 సీజన్: ఓపెనర్‌గా ప్రమోషన్ పొంది 174.41 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 600 పరుగులు.

ఓవరాల్ రికార్డు: 27 ఇన్నింగ్స్‌ల్లో 49.21 సగటుతో 1,132 రన్స్ (2 సెంచరీలు, 8 హాఫ్ సెంచరీలు).

అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న కేఎల్ రాహుల్ లాంటి టాప్ ఆర్డర్ బ్యాటర్ ని వదులుకోవడానికి ఢిల్లీ యాజమాన్యం సిద్ధంగా లేదు. వివాదాలను పక్కనబెట్టి రాబోయే సీజన్‌లోనూ రాహుల్‌నే తమ మెయిన్ వెపన్‌గా బరిలోకి దింపేందుకు సిద్ధమవుతోంది.

# ‘వారణాసి’ హైదరాబాద్ టూ అంటార్కిటికా జర్నీ!




ఇండియాస్ మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ గా తెరకెక్కుతోన్న సంచలన చిత్రం ‘వారణాసి’. సూపర్ స్టార్ మహేష్ కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది. కథా నేపథ్యం, విజువల్స్ పరంగా చిత్రం సరికొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది. విభిన్నమైన సంస్కృతులు, భౌగోళిక వాతావరణాల కలబోతగా రూపొందుతున్న చిత్రం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఒక్కసారి ఈ సినిమా విశేషాల్లోకి వెళ్తే.. ఈ సినిమా చిత్రీకరణ ప్రయాణం భాగ్యనగరం హైదరాబాద్‌లోనే ఘనంగా ప్రారంభమైంది. అధునాతన సెట్లు, కీలక నటీనటులపై ప్రధాన సన్నివేశాల చిత్రీకరణను ఇక్కడే పూర్తి చేశారు. నిర్మాణ పరంగా అన్ని సౌకర్యాలు కలిగిన హైదరాబాద్ నుంచి మొదలైన సుదీర్ఘ ప్రయాణం, కథాగమనానికి అనుగుణంగా దేశవిదేశాల్లోని అనేక విభిన్న ప్రాంతాలకు విస్తరించడం విశేషం. హైదరాబాద్ షెడ్యూల్ అనంతరం చిత్ర బృందం ఒడిశాలోని ప్రకృతి రమణీయమైన చారిత్రక ప్రాంతాలకు చేరుకుంది. అక్కడ అందుబాటులో ఉన్న సహజసిద్ధమైన లొకేషన్లు, దట్టమైన అడవులు మరియు తీర ప్రాంతాల్లో కీలక ఘట్టాలను చిత్రీకరించారు. ఒడిశాలోని ప్రత్యేక వాతావరణం సినిమాకు కావాల్సిన రా అండ్ రియలిస్టిక్ లుక్‌ను అద్భుతంగా అందించింది. అక్కడి నుంచి ప్రాజెక్ట్ గ్లోబల్ లెవెల్‌కు రీచ్ అయింది. ఆఫ్రికా ఖండంలోకి ప్రవేశించింది. ఆఫ్రికాలోని విలక్షణమైన భూభాగాలు, ఎడారి ప్రాంతాలు , సహజ అడవుల నేపథ్యంలో శ్రమతో కూడుకున్న యాక్షన్ సన్నివేశాలను రూపొందించారు. హాలీవుడ్ చిత్రాలకు తగ్గకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ ఆఫ్రికాలో తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయనడంలో సందేహం లేదు.

అన్నింటికంటే ప్రసిద్ధమైన అత్యంత సాహసవంతమైన ఘట్టం అంటార్కిటికా షెడ్యూల్. అత్యంత ప్రతికూల వాతావరణం, సున్నా కన్నా తక్కువ ఉష్ణోగ్రతలు ఉన్న అంటార్కిటికా మంచు ఖండంలో షూటింగ్ జరపడం అరుదైన మైలురాయి. రికార్డు స్థాయిలో అత్యంత కష్టతరమైన పరిస్థితులను తట్టుకుని అక్కడ సాధించిన చిత్రీకరణ, విజువల్ పరంగా భారతీయ ప్రేక్షకులకు సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేయనుంది. హైదరాబాద్ టూ అంటార్కిటికా వరకు సాగిన ప్రయాణం లో కొంత భాగం మాత్రమే షూటింగ్ పూర్తి చేసుకుంది. ఏడాది చివరికల్లా మిగతా చిత్రీకరణ పూర్తి చేస్తామని జక్కన్న ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ప్రదేశాల్లో.. ఇంకెన్ని దేశాల్లో షూటింగ్ జరుతుందన్నది ఆసక్తికరం. సినిమాకు సంబంధించి ఇంకా షూట్ చేయాల్సిన కీలకమైన సన్నివేశాలు చాలా ఉన్నాయి. వాటి కోసం సిటీలోనే ప్రత్యేకంగా సెట్లు నిర్మిస్తున్నారు. అవపసరం మేర ఔట్ డోర్...ఆ సన్నివేశాలు డిమాండ్ చేసే విదేశీ లొకేషన్లను షూటింగ్ నిర్వహించనున్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com